J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 24 15.11.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మొండి జగమొండై.. జగన్ జగడం!



'మొండివాడు రాజుకంటే బలవంతుడు'.. ఇది మనం తరచూ వినే సామెత. మరి ఆ మొండివాడే జగమొండిగా మారితే ఎవరికంటే బలవంతుడు...? అంటే మేధావులు కూడా చెప్పలేరేమో. ఆంధ్రా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోకడ ఇప్పుడు అలాంటి సమాధానం దొరకని ప్రశ్నగా ఉందంటున్నారు విశ్లేషకులు. మొండివాడే రాజై, అయిదేళ్ళ తరువాత తన రాజ్యం కోల్పోతే జగమొండిగా మారతాడనడానికి జగన్‌ని ఉదాహరణగా పేర్కొంటున్నారు.

నాన్న చూపిన రాజకీయ బాట, వై.ఎస్. అన్న ఇంటిపేరు, రాజశేఖరరెడ్డి వారసుడు అన్న ట్యాగ్.... ఇవన్నీ జగన్‌మోహన్‌రెడ్డిని పదేళ్ళ పాటు ప్రజాక్షేత్రంలో నాయకుడిగా నిలిపాయి. జగన్‌కి ఏమాత్రం పాలనా అనుభవం లేకపోయినా

10లో






## ఆ నలుగురికీ పదవులు

కూటమి ప్రభుత్వం పదవుల పంపకం మొదలుపెట్టింది. గత వైసీపీ పాలనలో తమ పార్టీ కోసం ప్రాణాలొడ్డి పోరాడిన పార్టీ శ్రేణులకి వివిధ హోదాలు కల్పించి పట్టం కడుతోంది. గడచిన అయిదేళ్ళలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారు. కేసులు ఎదుర్కొన్నారు. దౌర్జన్యాలని తట్టుకుని నిలబడ్డారు. వారందరిని ఇప్పుడు పార్టీ అధినాయకత్వం గుర్తిస్తోంది. సముచిత స్థానాలని కేటాయించి గౌరవిస్తోంది. ఇదే క్రమంలో జిల్లాకు చెందిన నలుగురు నాయకులకి నామినేటెడ్ పదవులు దక్కాయి. ఆ నలుగురూ వైకాపాకి ఎదురొడ్డి పోరాడిన వారే.!

11లో

## హృదయాంజలి



డాక్టర్ వై.మనోజ్‌కుమార్‌రెడ్డి

జననం : 04-05-1966 నిర్యాణం : 02.11.2024

### మిత్రమా మనోజ్...

ఇది ఏ జన్మ సంబంధమో, ఈ జన్మలో మిత్రబంధమై,
ఆత్మీయ అనుబంధమై,
మధురానుబంధంగా ముడిపడిపోయింది.

ప్రాణస్నేహితుడిగా, అత్యంత సన్నిహితుడిగా,
నాతో నువ్వు గడిపిన క్షణాలు మరపురానివి, మరువలేనివి.

నిజమైన స్నేహానికి నిలువెత్తు నిదర్శనం నువ్వు
మంచితనం, మానవీయతకు మారుపేరు నువ్వు.

### నేస్తమా...

నీ తియ్యని పిలుపు, నీ కమ్మని పలుకు ఇక లేవంటే..
నాతో సహా నీ స్నేహ మాధుర్యాన్ని ఆస్వాదించిన
వారెవ్వరం నమ్మలేకున్నాం.

నీ పవిత్ర ఆత్మకి సద్గతి చేకూరాలని దైవాన్ని ప్రార్థిస్తూ...
నా హృదయాంజలి..!

సదా నీ తీపి జ్ఞాపకాలతో...

బి.వి.కృష్ణారెడ్డి, చైర్మన్
డాక్టర్స్ మెడికల్ అకాడమి, అమరావతి ఐఐటి.
తిరుపతి । నెల్లూరు । విజయవాడ । బెంగళూరు

# ఇది అన్నదాతల బాగు కోరే ప్రభుత్వం

## • కొనియాడిన మంత్రి ఆనం



'ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం. నిరంతరం అన్నదాత బాగుకోరే మంచి ప్రభుత్వం' అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 10న ఆయన ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో 214 మంది రైతులకు రూ. 2.55 కోట్ల విలువైన డ్రిప్‌లు, స్ప్రింక్లర్లను, మంత్రి అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో రూ. 1.96 కోట్ల ప్రభుత్వ రాయితీతో రైతులకు పరికరాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యంచేసి రైతాంగాన్ని విస్మరించిందని, జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతుల గురించి పట్టించుకోలేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఆసక్తి ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీతో వ్యవసాయానికి అవసరమయ్యే పరికరాలను అందించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు.

## అర్చక నేతల ధన్యవాదాలు



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం అర్చకుల సమస్యలు పరిష్కరిస్తున్న కూటమి ప్రభుత్వానికి నెల్లూరు జిల్లా అర్చక సమాఖ్య ధన్యవాదాలు తెలియజేసింది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈనెల 10న నెల్లూరులోని వారి నివాసం వద్ద అర్చక సమాఖ్య నాయకులు కలిసి, ఆలయాల్లో ధూప దీప నైవేద్య పథకాన్ని 5 వేల నుంచి 10వేల రూపాయలకు పెంచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, అర్చక సమాఖ్య నాయకులు ఉదయగిరి వెంకట శేషాచార్యులు, గుడ్లూరు ఫణికుమార్, వజ్జుల శ్రీనివాసులు, రామాయణం మణి, శ్రీశైలం శ్రీధర్, పొరా శ్రీధర్, సత్యనారాయణ, బాలసుబ్రహ్మణ్యం, లోకా ప్రసాద్ తదితరులున్నారు.

## వేదగిరిలో..వైభవంగా పవిత్రోత్సవాలు



నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 11న స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానసాగమ విద్వాన్ డా. పి.సత్యనారాయణాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఆలయ ఇఓ వేమూరి గోపి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల సారధ్యంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కన్నులపండువగా పూజలు జరిగాయి.



## సిద్ధలయ్యకోన తిరునాళ్ళు

రాపూరు మండలంలోని సిద్దలయ్య కోనలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో ఈనెల 11న స్వామివార్ల తిరునాళ్ళ వేడుకగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఆలయంలో కొలువైవున్న శ్రీ నవకోటి సిద్దేశ్వరస్వామి, శ్రీ నవనాథ సిద్దేశ్వరస్వామిని, శ్రీ సారంగధర స్వాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మేధా దక్షిణామూర్తి స్వామివారి మందిరంలో హోమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ కాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



**చిన్ని నారాయణరావు**
9440202942



## పెన్సిలోపాఖ్యానం

చిత్రిక పడితే
పుటం పెట్టిన బంగారమై మెరిస్తే
అచ్చెరువందాల్సిందే!
అది అసమాన సౌలభ్యంతో గర్జిస్తుంది
మనల్ని అనిమిషుల్ని చేసే విధంగా
తంబూర మీటుతుంది
రాయని భాస్కరులకు ఏదైనా
పోలిక ఉండదు
రాసే వ్యక్తులకే అది పట్టం కట్టి
విహాయసాన నిలుపుతుంది.
చివరివరకు తురుపుముక్కగా
నిలచేది నాలుగణాల నల్లని ముక్కేగా
అరచేతిలో చేరి ముద్దుముద్దుగా
చిన్ననాటి అక్షరమైదానాల్నుంచి
కీకారణ్యాలను తొలగించే విషయ
పరిజ్ఞాన ప్రాయం వరకు మనకు
నేస్తమయ్యే 'చేవ'తెల్సిన ఆయుధమే అది!
అలా కొనసాగి, ప్రొఫెషనల్
జీవితానికి సైతం చేదోడువాదోడై
దిక్సూచిగా మారి పండుగ చేస్తుంది.
రంగురంగుల సీతాకోకచిలుకల్లాంటి
రంగవల్లులు దిద్దే అపూర్వ ఆభరణం
కొండగుండెను పిడికిట పట్టి
ప్రాకారం చుట్టనూగలదు
బండరాయిని తొలచి హృద్యమైన
పూలపందిళ్ళు తొడగనూగలదు
అది అమ్మై దారిచూపిస్తుంది
ఆలోచనలకు పదును పెట్టికొద్దీ
మళ్ళీ మళ్ళీ చిగురిస్తుంది.
మన మనవళ్ళకు ప్రియనేస్తం
వారి కళాపిపాసల్ని తీర్చే అమృతహస్తం
చిగురాకు నెత్తావి అందించే స్వప్నమాధుర్యం
మానవజీవితాన్ని చుట్టుకొని పరిభ్రమించే
అభినవ పరాక్రమ సంకేతం.
చీకట్లో సైతం చందమామ పువ్వై,గువ్వై
ప్రకాశించే - పెన్సిలోపాఖ్యానం గురించి
వర్ణించతరమా ప్రియతమా!



## పూడికతీత పనులను..
# డ్రోన్ కెమెరాతో చిత్రీకరించాలి
### అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం

జిల్లాలో నీటిపారుదల కాలువల్లో చేస్తున్న పూడికతీత పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలసి నీటిపారుదల, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం, మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులకు ఇప్పటికే రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించే ముందే డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరణ చేయాలని, పనులు పూర్తయ్యాక కూడా మళ్ళీ డ్రోన్ కెమెరాతో ఆ పనులను చిత్రీకరించాలని అధికారులకు చెప్పామన్నారు. ఈ పనులన్నీ విమర్శలకు తావులేకుండా, పారదర్శకంగా జరిగేలా చూస్తున్నామన్నారు. అలాగే తమ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తున్నదనటానికి డ్రోన్ కెమెరాలను వినియోగించడమే నిదర్శనమన్నారు.

**రైతుల సమస్యలని పరిష్కరించిన మంత్రి :**

ఇటీవల ఐఏబి సమావేశంలో రైతులకు విద్యుత్తు 7గంటలు మాత్రమే అందిస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోయాయని రైతులు, రైతు సంఘాల నాయకులు సమావేశం దృష్టికి తీసుకురావడంతో, మంత్రి నారాయణ ఆ విషయాలను అధికారులతో చర్చించారు. సమస్య పరిష్కారం కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో, సెక్రటరీ విజయానంద్‌తో అప్పటికప్పుడు ఫోన్ ద్వారా మాట్లాడి, రైతులకు 9 గంటల విద్యుత్తు పంపిణీకి ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా జిల్లాకు 200 ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి రవికుమార్ కేటాయించారని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఇ విజయన్, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో..సాంఘిక అంశాలపై సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల సాంఘిక అంశాలపై సదస్సు నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, నోకియా సొల్యూషన్స్ ప్రతినిధి రాజశేఖర్ పాల్గొని విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యతోపాటు సాంఘిక అంశాలపై కూడా అవగాహన కలిగివుండాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్య మంచి ఇంజనీర్లుగా తయారు చేస్తుందన్నారు అనంతరం, వివిధ అంశాలపై జరిగిన పోటీలో విజేతలకు బహుమతులిచ్చారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్లు డా.పి. శ్రీహరిరెడ్డి, పి. నాగేంద్ర, ఆర్.రామ్‌ప్రసాద్, ఉదయ్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎన్ కిషిందర్, మెకానికల్ విభాగాధిపతి డా.సిహెచ్ ఆర్ విక్రమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్ట ప్రజలకు నీటివసతి లేక ఇక్కట్లు
### --- బీజేపీ నమామిగంగే కన్వీనర్ మిడతల రమేష్ ---



సరైన నీటి వసతి లేక ఉదయగిరి అసెంబ్లీలోని మెట్ట ప్రాంతాలలో ప్రజలు కిడ్నీ వ్యాధిగ్రస్తులవుతున్నారని, డయాలసిస్ రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ అడుగంటిన భూగర్భ జలాలతో సేద్యం చేస్తున్నందున ఆ జలాల్లో ఉన్న భారీ లోహ మిశ్రమాలతో కలసిన నీటి వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. సాగునీటి వసతి లేనందున 70 శాతం మంది యువత వలస కార్మికులుగా బయట ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. మెట్ట ప్రాంత అభివృద్ధి కోసం వెలుగొండ ప్రాజెక్ట్ నీటిని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు తరలించాలని, తద్వారా గండిపాలెం-సీతారాం సాగర్ ప్రాజెక్టులకు నీరందించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. అల్లూరు నాగేంద్రసింగ్, సాయి శ్రీనివాసులు, సుజన, ఆదినారాయణ, నీలిశెట్టి లక్ష్మణరావు, కె వీరరాఘవులు, చిరివెళ్ల చంద్ర, రాములు, నారాయణయాదవ్ పాల్గొన్నారు.

## గిరిజనుల కష్టాలపై...

# అసెంబ్లీలో గళమెత్తిన ప్రశాంతమ్మ



తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో అనాదిగా యానాదులు, చల్ల యానాదులు అధిక సంఖ్యలో ఉన్నారని, ఎంతోకాలంగా అనేక సమస్యలతో వారు సతమతమవుతున్నారని, వారి కష్టాలు తీర్చాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శాసనసభలో గళ మెత్తారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆమె అసెంబ్లీలో గిరిజనుల సమస్యలను ఏకరువు పెట్టారు. కోవూరు నియోజకవర్గంలో సుమారు వందకు పైగానే కాలనీల్లో గిరిజనులు జీవిస్తున్నా రని, వారంతా అప్పటి ముఖ్యమంత్రి, దివంగత ఎన్‌టి రామారావు హయాంలో కట్టించిన ఇళ్లలోనే ఇప్పటికీ నివసిస్తున్నా రని, కాలక్రమంలో దాదాపు 6వేల ఇళ్ళు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. ఆ గిరిజనులందరికీ కొత్త ఇళ్ళు కట్టించి వారిని కష్టాల నుంచి ఆదుకోవాల న్నారు. అదేవిధంగా, కోవూరు నియోజక వర్గంలోని కొడవలూరు మండలం చంద్ర శేఖరపురం గ్రామంలో ఒక్క ఏకలవ్య మోడల్ స్కూల్ మాత్రమే ఉందని, గిరి జనుల విద్యా ప్రమాణాలను పెంపొందిం చేందుకు మండలానికి ఒకటి చొప్పున ఏకలవ్య మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయా లని ఆమె కోరారు. గిరిజనులకు ఆధార్ కార్డుల జారీలో సమస్య ఉండడం వల్ల ప్రభుత్వ పథకాలు వారికి చేరడం లేదని, ఆ విషయం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం యానాది కార్పొరేషన్ ద్వారా అధిక మొత్తంలో నిధు లను కేటాయించి గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అందుకు, రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమాధానమిస్తూ, గత ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలలను నిర్వీర్యం చేసిందని, ప్రస్తుతం మన ప్రభుత్వం హయాంలో వాటిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలి పారు. గిరిజనుల అభివృద్ధికి బడ్జెట్‌లో 7,500 కోట్లు కేటాయింపులు చేశామని, తప్పకుండా గిరిజనుల సమగ్రాభివృద్ధికి పాటుపడతామని హామీ ఇచ్చారు.

## ప్రొఫెసర్ సీతాకుమారికి..

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం




నెల్లూరీయురాలు, ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి. సీతాకుమారి రాష్ట్ర స్థాయి 'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం' అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. గతంలో నెల్లూరు వీఆర్ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన దివంగత తూములూరి శివకామసుందరం కుమార్తె ఆమె. వీఆర్ లా కళాశాలలో బీ.ఎల్ చదివిన సీతాకుమారి, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ నుండి ఎం.ఎల్, న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. అనంతరం, వృత్తిరీత్యా ఆమె తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ, ఆ విశ్వవిద్యాలయంలో 'మహిళా రక్షణ కేంద్రాని'కి డైరక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

# జోరువానతో జనానికి తప్పని..'జల కష్టాలు'

- జిల్లా అంతా తుఫాన్ వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండుమూడు రోజులుగా జిల్లాలో వానలు దంచికొడుతున్నాయి. దీంతో ప్రజలకు వానకష్టాలు తప్పలేదు. పలు మండలాల్లో పొలాల్లో నార్లు మునిగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జోరువానతో జిల్లాలో జనజీవనం స్తంభించింది. బుధవారం అత్యధికంగా బోగోలులో 142 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అన్ని మండలాల్లో వానలు కురిశాయి. ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో జిల్లా అంతా తుఫాన్ వాతావరణం కనిపించింది. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో బుధ, గురువారాల్లో ఒకమోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నెల్లూరు నగరంలో 63.2, రూరల్‌లో 59.6 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. వానల దెబ్బకు నగరవాసులకు అవే కష్టాలు. లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. పలు కాలనీల్లో నీటిమడుగులు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సైడుకాలువలు నిండిపోయి రోడ్లపైకి రావడంతో, ట్రంకురోడ్డు, పెద్దబజారు, చిన్నబజారు, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లు సైతం కాలువలుగా మారాయి. ఆ మురుగునీటి దుర్గంధంతో జనం అవస్తలు పడ్డారు. అనేక ప్రాంతాల్లో, వీధుల్లో నీళ్ల మడుగులు కట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే, రైల్వే అండర్‌బ్రిడ్జిల కింద మాత్రం చేరుతున్న నీటిని కార్పొరేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు తోడేస్తుండడంతో ఆ బ్రిడ్జిల కిందంతా నీటిమడుగులుగా మారి, రాకపోకలు నిలిచిపోయే దుస్థితి నుంచి తప్పించినట్లయింది.

# పుస్తకాలు..జ్ఞానదీపికలు

- ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయాల్లో ఈ సంబరాలు పెద్దఎత్తున జరుగనున్నాయి. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని రేబాలవారి వీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిఇఒ బాలాజీరావు, గ్రంథాలయసంస్థ కార్యదర్శి కుమార్‌రాజా తదితరులు పాల్గొని ఈ వారోత్సవాలు ప్రారంభించారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, పుస్తకాలు జ్ఞానదీపికలని, ప్రతి విద్యార్థి మంచి పుస్తకాలు చదువుకుని నైతిక విలువలతో రాణించాలని వారు ఆకాంక్షించారు. తల్లితండ్రులు పిల్లలకు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం పట్ల ఆసక్తిని కలిగించా లన్నారు. ప్రముఖ కవి పెరుగురామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 'ఆర్‌ఆర్‌ఆర్'.. ఇక డెప్యూటీ స్పీకర్



**రఘురామకృష్ణరాజు... ఆయనను అందరూ ముద్దుగా ట్రిబుల్ ఆర్ అంటుంటారు. ఇప్పుడు ఆ ట్రిబుల్ ఆర్ ఆంధ్రప్రదేశ్ శాసన సభ డెప్యూటీ స్పీకర్ అయ్యారు.**

కాంగ్రెస్‌పార్టీపై ఉన్న మక్కువ, దివంగత రాజశేఖరరెడ్డితో ఉన్న సన్ని హిత సంబంధాలతో ఆయన కాంగ్రెస్ వాదిగా ఉండేవారు. వై.ఎస్. మరణా నంతరం ఆయన జగన్‌కి దగ్గరయ్యారు. జగన్ పార్టీ పెట్టిన కొత్తల్లో ఆయనకి మద్దతుగా నిలిచారు. తన రాజకీయ ప్రయాణాన్ని అక్కడి నుండి మొదలుపెట్టారు. అయితే, ఆ తరువాత కొద్దిరోజులకే వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి 'అపరిచితుడు' అని బిరుదు తగిలించి, ఆ పార్టీ నుండి బయటకి వచ్చేశారు. ఆ తరువాత బీజేపీలో చేరారు. అక్కడ నరసాపురం పార్లమెంటు టిక్కెట్టు ఆశించారు. కమలదళం టిక్కెట్టు ఇవ్వకపోవడంతో మళ్ళీ వైసీపీకి వచ్చారు. 2014 ఎన్నికల తరువాత వైసీపీ నుండి టీడీపీకి మారారు. అక్కడా ఉండలేక 2019 నాటికి టీడీపీకి గుడ్‌బై చెప్పి మళ్ళీ అదే 'అపరచితుడి' పంచన చేరి ఆ ఎన్నికలలో నరసాపురం పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. గెలిచిన ఏడాదిలోపే జగన్‌మోహన్‌రెడ్డి పోకడ నచ్చక వైసీపీ నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు.

జగన్‌మోహన్‌రెడ్డితో విభేదించినప్పటి నుండి వైసీపీకి వ్యతిరేకంగా ఆయన స్వరం పెంచారు. జగన్‌తో పాటు ఆయన చుట్టూ ఉన్న కీలక నేతలపై తీవ్ర ఆరోపణలతో ధ్వజమెత్తారు. వైసీపీ బడా నేతలు కూడా రఘురామకృష్ణరాజుని వెంటాడారు. జైల్లో పెట్టి పోలీసు దెబ్బలు రుచి చూపించారు. అదే ట్రిబుల్ ఆర్‌కి కలిసొచ్చింది. ఆయనకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయస్థాయిలో ఇమేజ్ తెచ్చింది. తాజాగా జరిగిన 2024 ఎన్నికలలో టీడీపీ ఆయనకి 'ఉండి' శాసనసభ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఆ అవకాశం రఘురామ కృష్ణరాజుని శాసనసభ్యుడిని చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆశీస్సులతో ఆయన కూటమి కీలకనేతగా మారారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అయిదు నెలలకి ఆయనని అత్యంత కీలక పదవి వరించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ డెప్యూటీ స్పీకర్ కావడంతో కూటమి వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఆయన రాజకీయ ప్రయాణం అనేక మలుపులు తిరిగి ఇప్పుడు ఆయనని ఉపసభాపతి చేసింది. జగన్‌మోహన్‌రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించి సంచల నాలకి సారధిగా నిలిచిన రఘురామకృష్ణరాజు దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మగా భావించే కెవిపి రామచంద్రరావుకు స్వయానా వియ్యంకుడు కావడం గమనార్హం!




లాయర్
నవంబర్ 15, 2024

# ప్రపంచానికి ముప్పుగా మారుతున్న.. 'ఇ-వ్యర్థాలు'!

స్మార్ట్‌ఫోన్ లేనిదే క్షణం గడవదు. టీవీ లేకుంటే చూసేదేమీ ఉండదు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు లేకుండా చేయగలిగేదేమీ లేదు. ఇవన్నీ పనిచేయాలంటే ఎన్నో రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండాల్సిందే. అవి లేకుండా ఒక్క క్షణం కూడా జరగని పరిస్థితి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఇవి తప్పని సరి. ఒక రకంగా చూస్తే..అవే ఇప్పుడు ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయన్నా అతిశయోక్తి కాదు. అందులోనూ శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాలే ఇప్పుడు మానవాళికి దిక్సూచీలుగా ఉంటున్నాయి. ఎంతో సులువుగా, ఎంతో ప్రయోజనకరమైన రీతిలో, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ అవి మానవాళికి చేస్తున్న సేవలు అమూల్యం.. అపారం!. ఇవన్నీ సంతోషించాల్సిన విషయాలే. అయితే, కాలదోషం పట్టిన ఆ పరికరాలను పారవేయడం వల్ల అనేక అనర్థాలున్నాయి. క్రమేణా భూమి మీదా, సముద్రాలు, నదులు వంటి జలప్రవాహాల్లో అవి కలసిపోతుండడం వల్ల పర్యావరణానికే కాదు, మానవుల ఆరోగ్యానికి కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అలా పారవేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు కనీసం 6 కోట్ల టన్నులకు పైగానే ఉంటాయని, ఇవి ప్రతిఏటా మరింత పెద్దసంఖ్యలో పెరగడమే తప్ప తరగడమన్నదే లేదని వారి ఆందోళన. 2030 నాటికి ప్రపంచం నిండా 8.2 కోట్ల టన్నుల వ్యర్థాలు చేరుతాయని, అందులో ఒక్క భారత్‌లోనే కోటి టన్నుల మేరకు ఉంటాయని అంతర్జాతీయ స్థాయి నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇ-వ్యర్థాలు అత్యంత ఎక్కువగా ఉండే దేశాల జాబితాలో అమెరికా, చైనాల తర్వాత మనదేశం కూడా ఉందని గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇ-వ్యర్థాల జాబితాలో అగ్రస్థానంలో ఉంటున్నాయని, ఒక్క హైదరాబాద్‌లోనే సుమారు 2.2 లక్షల టన్నులకు పైగానే వ్యర్థాలు చేరుతున్నాయని అంటున్నారు. ఇంతగా పెరిగిపోతున్న ఇ-వ్యర్థాలను అరికట్టడం ప్రపంచానికో పెద్ద సవాల్‌గా తయారవుతోంది. వీటిని నియంత్రించడం, రీ-సైక్లింగ్ (శుద్ధి) చేయడం ఎంతో అవసరమైనా, అందుకోసం ప్రత్యేకంగా నిబంధనలున్నా ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడంతో రానురాను ఇదొక పెద్దముప్పుగా తయారయ్యే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ఇప్పటికే ప్రపంచంలోని అనేక నదులు, సముద్రాల్లో ఈ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా ఉంటున్నాయి. వీటి వల్ల ఆ పరికరాల్లో ఉండే వందలాది రకాల ప్రమాదకరమైన, విషపూరితమైన రసాయనాలు నీళ్ళలోకి ప్రవేశిస్తాయి. భూమిలో పేరుకుపోవడంతో భూగర్భజలాలు కలుషితమవుతాయి. ఫలితంగా ప్రజలకు నానా రకాల అనారోగ్యాలు కలుగుతాయని, పర్యావరణానికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. వీటిని రీసైక్లింగ్ చేసే మెరుగైన పరిశ్రమలు సృష్టించుకోవడం తప్పని సరి అని హెచ్చరిస్తున్నారు. అయినా, అంతేలేకుండా పెరిగిపోతున్న ఇ-వ్యర్థాల నిరోధం అనేది చిన్న విషయమేమీ కాదు. చిత్తశుద్ధి లేకుంటే.. 'ఇ-వ్యర్థాల' శుద్ధి.. అంత సులభం కానే కాదు. ఈ వ్యర్థాలను నియంత్రించడానికి అన్ని దేశాలు యుద్ధప్రాతిపదికన సిద్ధమై కార్యాచరణ ప్రణాళికలు అమలుచేస్తే తప్ప వీటిని నియంత్రించడం సాధ్యమయ్యే పనికాదు. అయితే, వీటిని నిరోధించే విషయంలో, రీసైక్లింగ్ చేయడంలో వందలాది కంపెనీల ద్వారా మనదేశం మాత్రం బృహత్తరమైన కృషి చేస్తూనే ఉండడం చెప్పుకోదగ్గ విషయం. కానీ, నిత్యం కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్న వ్యర్థాలతో పోలిస్తే, అది తక్కువగానే ఉంటోంది.

ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచమంతటా నిరంతరం అనివార్యంగా టన్నులకొద్దీ వచ్చిపడుతున్న వ్యర్థాలను వీలైనంత త్వరగా నియంత్రించేందుకు ప్రభుత్వాలు ముందడుగు వేయాలి. అందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నే వినియోగించాలి. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను, ఉపకరణాలను, ఇ-బ్యాటరీలను సురక్షితమైన పద్ధతుల్లో పారవేసేందుకు అవసరమైన ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కులు అన్నిచోట్లా ఏర్పాటు కావాలి. శాస్త్రీయపద్ధతుల్లోనే వాటిని నిల్వచేసి, రీసైక్లింగ్ చేస్తే వాటివల్ల కలిగే ఇబ్బందులను పూర్తిస్థాయిలో అధిగమించవచ్చనే నిపుణుల సూచనలు అందరికీ మార్గదర్శకం కావాలి. 'ఇ-వ్యర్థాల' నిరోధానికి 'రీసైక్లింగ్' సరైన మార్గం కనుక, అన్నిచోట్లా ఆయా కంపెనీల్లో అనుభవజ్ఞులైన సాంకేతిక బృందాలతో వాటి 'శుద్ధి'కి సమాయత్తం కావాలి. మనదేశంతో పాటు ప్రపంచదేశాలన్నిటా కూడా ఆ ప్రయత్నం శరవేగంగా జరగాలి. ఇది ప్రపంచవ్యాప్త సమస్య కనుక, అన్ని దేశాలూ కలసికట్టుగా ఇ-వ్యర్థాల నివారణకు సత్వర కృషిచేయడం అవసరం. అలా చేయడం వల్ల మనకే కాదు.. భావితరాలకు కూడా శ్రేయస్కరం!..

# మీడియాని ఆటబొమ్మలా చూస్తున్న జగన్‌రెడ్డి!

ఆంధ్ర మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీడియాని ఆటబొమ్మలా చూస్తున్నాడు. గడచిన పదిహేనేళ్ళుగా ఆయన పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారాడు. సొంతంగా ఒక పార్టీ పెట్టాడు. ఆయనకి కూడా ఒక పత్రిక, ఛానెల్ ఉన్నాయి. కానీ, ఆయన మీడియాని ఆటబొమ్మలా చూడడమే విడ్డూరం. జగన్ ముఖ్యమంత్రి కాకముందు వరకూ మీడియాని బాగా వాడుకున్నాడు. ప్రతి చిన్న అంశానికీ టీవీల వాళ్ళని, పత్రికల వాళ్ళని పిలిచి సమావేశం పెట్టేవాడు. అదే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వాళ్ళని తాడేపల్లి కోట గడప కూడా తొక్కనీయలేదు. అంతా లైవ్ వీడియో ద్వారానే అయిదేళ్ళు గడిపేశాడు. ఇప్పుడు ఓడిపోయాక మళ్ళీ జగన్‌కి మీడియా కనపడుతోంది. ప్రెస్ మీట్లతో కాలక్షేపం చేస్తున్నాడు. కొత్తగా తాను అసెంబ్లీ సమావేశాలకి వెళ్లనంటున్నాడు. సభలో జరిగే అంశాలపై మీడియా సమావేశం పెట్టి ప్రశ్నిస్తానంటున్నాడు. అయిదేళ్ళు మీడియాని అంటరాని వాళ్ళుగా చూసిన జగన్‌రెడ్డికి, మీడియా అంటే తన చేతులో కీలుబొమ్మగా కనిపిస్తున్నట్లుంది. మీడియా సోదరులు సైతం జగన్ పిలవగానే తగుదునమ్మా అంటూ వెళ్లడం తమని తాము కించపరుచుకోవడమే అన్నది నా ఉద్దేశ్యం. తాను అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజు కూడా వీళ్ళెవరూ ఆయన కళ్ళకి కనపడలేదు. అదే మీడియాని ఇప్పుడు తన అవసరాలకి వాడుకోవాలని జగన్ చూస్తున్నాడు. ఆయన పిలిచీ పిలవగానే ఎగరేసుకుని వెళ్లడం ఎంతవరకూ సమంజసమో విజ్ఞత కలిగిన మీడియా సోదరులు కూడా ఆలోచించుకోవాలి. మీడియా అంటే జగన్ చేతిలో ఆటబొమ్మ కాదని తెలిసొచ్చేలా చేయాలి!

వై. రామచంద్రరెడ్డి, నెల్లూరు.




# మధుమేహంపై అవగాహన పెంచాలి!

గతవారం మన 'లాయర్'లో 'తియ్యటి వ్యాధి' అంటూ మధుమేహంపై రాసిన సంపాదకీయం అర్థవంతంగా ఉంది. మధుమేహాన్ని ప్రమాదకరంగా వూహించుకుంటున్న వారికి మేల్కొలుపులా అనిపించింది. 'డయాబెటీస్ జబ్బు కాదు ఆరోగ్య సమస్య మాత్రమే' అని చెప్పడం నాకు బాగా నచ్చింది. మధుమేహం పైన అవగాహన పెరగాలి. డయాబెటీస్ ప్రమాదకర వ్యాధి కాదు, అది ఆరోగ్య సమస్య మాత్రమే అన్న ధైర్యాన్ని బాధితులలో కల్పించాలి. నిత్య జీవితంలో మన ఆహారపు అలవాట్లు, జీవన సరళి మార్చుకుంటే అది మన దేహాన్ని ఏం చేయలేదన్న ధీమా కలిగేలా పత్రికలూ, డాక్టర్లూ ప్రజలని చైతన్యపరచాలి. ముఖ్యంగా చిరుతిళ్ళు, ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల కలిగే నష్టాన్ని వివరిస్తూ, వాటిపై సమరశంఖం పూరించాలి!

సి. ఆర్. విశ్వేశ్వరరావు - మాజీ ఉపకులపతి, హైదరాబాదు.




## ఆంధ్రాని అల్లాడిస్తున్న...

# అరాచక పీడ - సామాజిక చీడ!

అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ అస్తవ్యస్థమైపోయింది. వ్యవస్థలన్నీ అవస్థలపాలై అల్లాడుతున్నాయి. రాష్ట్రం అరాచకాలకు అడ్డాగా మారింది. అకృత్యాలకు నిలయంగా తయారైంది. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నెలవయ్యింది. అభం శుభం ఎరుగని చిన్నారుల కిడ్నాప్‌లు, వారిపై అత్యాచారాల సంఖ్య అంతకంతకీ పెరిగిపోతోంది. దౌర్జన్యాలు, మానభంగాలు, హత్యలు ఎక్కువైపోతున్నాయి. మాదకద్రవ్యాల ముఠాలు పెట్రేగిపోతున్నాయి. అసాంఘిక శక్తులు చెలరేగిపోతున్నాయి. రాష్ట్రంలో రానురాను కీచకుల సంఖ్య పెరిగిపోతోంది. ఆకతాయిల అకృత్యాలకు అడ్డూఅదుపూ ఉండడం లేదు. దానికి తగ్గట్టు ఎక్కడ చూసినా బూతుమాటలు, రోత కూతలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు.. గతంలో ఎప్పుడూ విననంత గబ్బుమాటలు సర్వసాధారణమైపోయాయి.

### అవును... మీరు చదువుతున్నది నిజమే ..!

రాష్టంలో ఎవరిని కదిలించినా ఇదే మాట. పోలీసులు, ప్రభుత్వాలు, నిబంధనలు లాంటివి ఎన్ని ఉన్నా ఇలాంటి దుర్మార్గాలు నిత్యకృత్యం అయిపోతున్నాయన్నది వారి ఆందోళన. ఇది ఈరోజు కొత్తగా జరుగుతున్న తంతు కాదు. ఉమ్మడి రాష్టం రెండు ముక్కలుగా చీలిపోయి అనాధగా మారిన ఆంధ్ర, చిన్న రాష్టంగా ఏర్పడ్డనాటినుండి క్రమేణా మారుతూ వచ్చిన పరిస్థితి. గత కొద్ది సంవత్సరాలుగా రాష్టంలో ఈ విషసంస్కృతి వీరంగం చేస్తోంది.

సుస్థిరత లేని పాలన. తాడు బొంగరం లేని నిర్ణయాలు. సమర్థ నాయకత్వం లేని రాజకీయం. రాజధాని లేని రాష్టం. నియంత్రణ లేని అధికార యంత్రాంగం. భయం లేని యువత. భయపెట్టలేని చట్టాలు. న్యాయస్థానాలంటే లెక్కలేని తనం. ఆంధ్ర రాష్టం అథఃపాతాళానికి పడిపోవడానికి ఇలాంటివే అనేక కారణాలు. "రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళ మీద పరిగెత్తినట్టు" అన్న చందంగా తయారైన పరిస్థితులు. ఇవన్నీ అందరూ వింటున్నవే.. కళ్ళారా చూస్తున్నవే.

### ఉన్మాదంగా మారిన సామాజిక మాధ్యమాలు!

ఈ దౌర్భాగ్యం చాలదన్నట్లుగా సామాజిక మాధ్యమాల వేదికగా కొంతమంది సృష్టిస్తున్న తప్పుడు ప్రచారాలు, ఛండాలపు ఆరోపణలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. మానసికంగా వేదిస్తున్నాయి. కేవలం సామాన్యులని, సెలబ్రిటీలనే కాదు.. రాజకీయ నాయకులు, వారి భార్యాబిడ్డలు, కుటుంబ సభ్యులని కూడా వీళ్ళు వదలరు. ఏ క్షణాన ఎవరిమీద పోస్టింగులు పెడతారో తెలియదు. అవతలి వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా ఈ సామాజిక ఉన్మాదులకి లెక్కలేదు. ఎవరినీ ఖాతరు చేయరు. ఇలాంటి అనేకమంది సామాజిక శాడిస్టులకి రాజకీయంగా వీరికంటే దిగజారిన నేతల అండదండలు ఉండడంతో 'మేమేం చేసినా..మమ్మల్ని ఎవరేం పీకలేరు' అన్న ధీమా ఎక్కువ. వీళ్ళ రాతలకి, మాటలకి సెన్సార్ ఉండదు. వీళ్ళ చేష్టలకి నియంత్రణ ఉండదు. వీళ్ళకి ఉచ్ఛం, నీచం ఉండవు. నీతి, నియమాలు పట్టవు. సోషల్ మీడియాలో కొంతమంది తమ ఇష్టానుసారం పెడుతున్న నీచమైన పోస్టులను చూసి, సాక్షాత్తూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల వంటివారే షాకవుతున్నారంటే పరిస్థితి మరీ ఎంత అధ్వాన్నంగా తయారైందో చెప్పక్కరలేదు.

### గజదొంగలే 'దొంగ... దొంగ' అని కేకలేస్తున్నారు!

గత ప్రభుత్వంలో బడా నేతలు మద్యం, ఇసుక, గనులు, భూములు, అడవులు, కొండలు, గుట్టలు అన్నీ దోచేశారు. 'అక్రమ సంపాదనకి కాదేదీ అనర్హం' అన్నట్లుగా వందలు వేల కోట్లలో ప్రకృతి సంపదనంతా స్వాహాచేసేశారు. అప్పుడు అడ్డగోలుగా దోచేసుకుని ఇప్పుడు దొరలుగా చలామణి అవుతున్నారు. నాయకులుగా ఇంకా పెత్తనం చెలాయిస్తూనే ఉన్నారు.

రాష్టంలో కూటమి ప్రభుత్వం వచ్చి అయిదు నెలలు మాత్రమే అవుతోంది. గత ప్రభుత్వంలో అయిదేళ్ళు కొనసాగిన అక్రమాలన్నింటిని బట్టబయలు చేయాలంటే ఇంకా కొంత సమయం పడుతుంది. ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా తీగ లాగుతున్నారు. డొంకలు కదులుతున్నాయి. ఘోరాతిఘోరాలు బయటపడుతున్నాయి. అంతలోనే గత పాలకులు సామాజిక మాధ్యమాల వేదికగా గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలు పెరిగిపోతున్నాయని గోల చేస్తున్నారు. తాము గజదొంగలమన్న సంగతి మర్చిపోయి, వారే 'దొంగ... దొంగ' అని అరుస్తున్నారు. అది చూసి.. జనం విస్తుపోతున్నారు.

### క్షణమో యుగంలా...!

గనుల ఘనులు, మద్యం మాయగాళ్ళు, ఓ వైపు పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలని సాగిస్తున్నా, మరోవైపు వణికిపోతున్నారు. అధికార పార్టీ తమ ఘనకార్యాలని సాక్ష్యాధారాలతో సహా ఎక్కడ బయటపెడుతుందోనని క్షణమో యుగంలా గడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ గుట్టు ఎక్కడ బయటపెట్టి తమని కటకటకాలపాలు చేస్తుందోనని భయపడిపోతున్నారు. ఇప్పటికే కొంతమంది అజ్ఞాతవాసం గడుపుతున్నారు.

### చర్యలు వేగవంతం కావాలి!

ఇకనైనా ప్రభుత్వం చర్యలలో వేగం పెంచాలి. అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలి. అక్రమాలతో.. అన్యాయాలతో ప్రభుత్వ సొత్తును.. ప్రజాధనాన్ని కొల్లగొట్టుకుపోయినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎవరెవరు ఎంత దోచుకుపోయారో లెక్కలు తేల్చాలి. ఆ సొత్తునంతా తిరిగి రాబట్టాలి. ఖాళీ అయిపోయిన ప్రభుత్వ ఖజానాను మళ్ళీ నింపాలి.

మరోవైపు పసిపిల్లలు, ఆడబిడ్డల పాలిట రాక్షసులుగా మారిన కామాంధుల అంతుచూడాలి. రోజురోజుకీ రెట్టింపవుతున్న ఈ హేయమైన, ఆమానవీయమైన దుష్ట సంస్కృతిని చీల్చిచెండాడాలి. అసత్య ప్రచారాలకు, నిస్సిగ్గు వ్యాఖ్యలకు తావులేకుండా, సామాజిక మాధ్యమాలని ఉన్మాదులకి వేదికలు కాకుండా నియంత్రించాలి. తప్పు చేసినవారు ఎంతటివారైనా నిర్మొహమాటంగా కఠినచర్యలు తీసుకోవాలి.

సమాజంలో కీలకమైన నాలుగు వ్యవస్థలు డెమోక్రసీ, బ్యూరోక్రసీ, జ్యుడీషియరీ, మీడియా ఒక్క తాటిపై నడచి పెరిగిపోతున్న దురాగతాలకు, అరాచకాలకు అడ్డుకట్టవేయాలి. మంచిని పెంచాలి, చెడుని తుంచాలి. ముఖ్యంగా సమాజంలో మానవత్వం మసిబారకుండా కాపాడాలి. ఇది అందరి తక్షణ బాధ్యత. అక్రమాలకి అరాచకాలకి అడ్డాగా మారి అంధకారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించాలి. అన్ని రంగాలలో ఆంధ్రను అగ్రభాగాన నిలపాలి!

- రాజశ్రీ

### 15, 16, 17 తేదీల్లో...

# శ్రీ స్వర్ణలింగేశ్వరుని మహాకుంభాభిషేకం



యిమ్మణ్ణి వెంకట్‌రావు - దీపా వెంకట్ దంపతుల సహకారంతో విష్ణు కార్స్ సౌజన్యంతో స్వర్ణభారత్ ట్రస్ట్ సారథ్యంలో నెల్లూరు చెరువుగట్టు వద్దనున్న గణేష్‌ఘాట్‌లో నిర్మించిన శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థాన మహాకుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వైభవోపేతంగా జరుగనున్నాయి. 15వతేదీ శుక్రవారం ఉదయం 8గంటల నుంచి గణపతి పూజతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. జగద్గురువులు శ్రీ శృంగేరి దక్షిణామ్నాయ శారదా పీఠం ఉత్తర పీఠాధిపతులు పూజ్యశ్రీ విధుశేఖరభారతిమహాస్వామి వారు, తుని-తపోవన పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామివార్ల చేతుల మీదుగా విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. భక్తి శ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు విచ్చేసి ఆ స్వర్ణలింగేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు కోరుతున్నారు.

# శ్రీసిటీలో అలరించిన భాగవత సప్తాహం



శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 7రోజుల పాటు చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం మంగళవారంతో ముగిసింది. శ్రీసిటీ-శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజం సభ్యులు ఈనెల 6న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ మహోత్సవం ప్రారంభించారు. బయపురెడ్డి, ఎస్.రామసుబ్బారెడ్డిల నేతృత్వంలో 12 మంది భక్తబృందం వారం రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు భక్తి శ్రద్ధలతో, భాగవతంలో 12 స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠించి, మంగళవారం మధ్యాహ్నానికి ప్రత్యేక పూజలతో పూర్తిచేశారు. భాగవత వైశిష్ట్యాన్ని వారు వివరిస్తూ రాష్ట్రమంతటా ప్రతినెలా భక్తులు కోరిన చోట ఈ భాగవత భక్త సమాజ బృందం వారు భాగవత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 391 సప్తాహాలు పూర్తిచేయగా, శ్రీటీలో 392వ కార్యక్రమం జరిపారు. పచ్చదనం నిండిన చల్లని ఆహ్లాదకర వాతావరణంలో శ్రీసిటీలోని ఆలయంలో వారం రోజుల భాగవత సప్తాహం తమకు సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. చివరిరోజు కార్యక్రమంలో పాల్గొని, భాగవత భక్త సమాజ బృందానికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు చెప్తూ, భాగవత సప్తాహం చేయడం మన సమాజానికి అత్యంత ప్రయోజనకరమైన యజ్ఞం వంటిదని కొనియాడారు. భాగవత భక్త సమాజ సభ్యులను శాలువాలతో సత్కరించి, స్వామివారి తీర్థ, అన్నప్రసాదాలను అందచేశారు. చిన్మయ విద్యాలయ విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు చివరిరోజు భాగవత సప్తాహంలో భగవద్గీత పఠనం చేయడంతో పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.బి.ఎస్.శాస్త్రి, పల్లేటి బాలాజీ ఈ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.


# శ్రీవారి సేవకురాలిగా.. పనబాక ప్రమాణం



కేంద్ర మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకురాలు పనబాక లక్ష్మి తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పనబాక లక్ష్మి-కృష్ణయ్య దంపతులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. పనబాక లక్ష్మి మాట్లాడుతూ, టీటీడీ బోర్డు సభ్యురాలిగా భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

### ఎమ్మెల్యే కాకర్ల చొరవతో...

# ఉదయగిరి రోడ్లకు మోక్షం



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి గడ్డపై తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తిరిగిన ఆయనకు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల దర్శనమివ్వడం, అందుకు చలించిపోయిన ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే రోడ్ల రూపురేఖలు మారుస్తానని హామీ ఇవ్వడం అందరికీ తెలిసిందే. తాను ఎమ్మెల్యే అయ్యాక, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు 100కోట్ల రూపాయలతో నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల నిర్మాణాలకు బాటలు వేస్తున్నారు. దీంతో ఉదయగిరి రోడ్లకు మోక్షం లభించినట్లయింది. ఎప్పుడూ సీసీ రోడ్లు చూడని మారుమూల గ్రామాలలో సైతం ఆ రోడ్లను వేయిస్తూ ఆయన గ్రామీణ ప్రజల ప్రశంసలందుకుంటున్నారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో మొత్తం 333 పనులు ఇప్పుడు వేగవంతంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా, మరో 20 కోట్ల రూపాయల పనులకు కూడా ప్రతిపాదనలు పంపి ఉన్నారు. దీంతో ఉదయగిరి ప్రజలు ఎమ్మెల్యే కాకర్ల చొరవను అభినందిస్తూ, ఉదయగిరి అభివృద్ధికి ఇక ఢోకాలేదనే ధీమాతో ఉన్నారు.


పుణ్యదంపతులకి అక్షరాంజలి!



కీ॥శే॥ వల్లూరు నాగభూషణం గారు - కీ॥శే॥ వల్లూరు మధుసూదనమ్మ గారు
(విశ్రాంత గెజిటెడ్ తహశీల్దార్ మరియు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి గారి మాజీ వ్యక్తిగత కార్యదర్శి)

నాకు ఊహ తెలిసేసరికి మా అక్క మధుసూదనమ్మ గారికి నాగభూషణం మామతో పెళ్లయిపోయింది.
(ఆయన మా అమ్మకి తమ్ముడు, నాకు మేనమామ)
నాకు ఏడేళ్లు వచ్చేసరికి మా నాన్న శ్రీ సిద్ధయ్యనాయుడు దైవసాన్నిధ్యం పొందడంతో...
నన్ను, మా అమ్మ, శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారిని, మా అన్న చంద్రశేఖరం గారిని
నాగభూషణం మామ చేరదీశారు.
నన్ను ఉన్నత చదువులు చదివించారు. నాతోపాటు చదువుల నిమిత్తం వచ్చిన
పెద్దమ్మ, పిన్నమ్మల పిల్లలనందరినీ తమ పిల్లలతో సమానంగా చూసేవారు ఆ పుణ్యదంపతులు.
పల్లెలలో విద్యా వసతి అంతగా లేని 1960 - 1970 దశకాల్లో వీరిద్దరూ విద్యాదానం చేసి
పుణ్యం మూటకట్టుకోవడం వల్లనే.. ఇప్పుడు వీరి మనుమలు, మనుమరాళ్ళు
ఇండియాతో పాటు అమెరికా, కెనడా దేశాల్లో స్థిరపడ్డారు.
దీనజన బాంధవుడు శ్రీ నాగభూషణం మామ వర్ధంతి సందర్భంగా
ఈ పుణ్యదంపతులను స్మరించుకుంటూ...
అక్షరాంజలి ఘటిస్తున్నాము.
ఇట్లు
శ్రీమతి & శ్రీ నిడిగంటి గోవర్ధనరావు
విశ్రాంత అధికారి, వాణిజ్య పన్నుల శాఖ, నెల్లూరు.
బృంద సభ్యుడు, తెలుగు సాహిత్య వేదిక & ఎన్ఎన్‌టివి, డల్లాస్ ఫోర్ట్‌వర్త్ ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం



# వైభవోపేతం.. లక్ష దీపోత్సవం!

**కార్తీక దీపాల వెలుగులు, పవిత్ర హోమాలు..పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేకపూజలతో నెల్లూరు వీఆర్సి మైదానం శోభాయమానమైంది. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వేమిరెడ్డి దంపతుల సారథ్యంలో మూడురోజుల పాటు ఈ వేడుక ఆధ్యాత్మిక సంబరంగా అందరినీ ఆకట్టుకుంది. వేల సంఖ్యలో భక్తజనం పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం వినడం కోసం, పూజ్యశ్రీ రామానంద భారతి, శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీల అనుగ్రహభాషణల కోసం జిల్లావ్యాప్తంగా భక్తులు వేలాదిగా తరలివచ్చారు.**

పవిత్రమైన కార్తీమాసం సందర్భంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరులోని వీఆర్సి మైదానంలో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక లక్ష దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. శివ నామం హోరెత్తిపోయింది. ఆధ్యాత్మిక సేవాతత్పరులు, సేవాభూషణులు.. మహా దాత, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల నేతృత్వంలో 'నభూతో న భవిష్యతి' అన్నట్లుగా జరిగిన ఈ కార్తీకదీపోత్సవం నెల్లూరీయులకు మరో ఆధ్యాత్మిక పండుగగా వెల్లివిరిసింది. కార్తీక దీపకాంతులతో వీఆర్సి మైదానం మెరిసిపోయింది. మహిళాభక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. తొలిరోజు విపిఆర్ దంపతులు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్ఫటిక లింగానికి మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం చేశారు. శ్రీ త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, అయోధ్య రామ మందిరం నమూనా ఆలయాలను ప్రారంభించారు. శివకేశవారాధనలతో, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో, శ్రీ రామానందభారతి, శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీల అనుగ్రహాశీస్సులతో భక్తులు పులకించిపోయారు.



# ఆదర్శప్రాయుడు.. మౌలానా ఆజాద్

'భారతరత్న' మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. ఈనెల 11న ఆయన జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వేడుకలు జరిగాయి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు

**-సాగునీటి సలహాబోర్డు సమావేశంలో మంత్రి నారాయణ**



జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని, సోమశిల డ్యామ్ ద్వారా 5లక్షల 51వేల ఎకరాలు, కండలేరు ద్వారా 2.26 లక్షల ఎకరాలు మొత్తం 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన సాగునీటి సలహాబోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సోమశిలలో 69 టీఎంసీలు, కండలేరులో 50 టీఎంసీలు నీరు అందుబాటులో ఉందని, సాగునీటికి ఇబ్బంది లేదని తెలిపారు. ఒక్క చుక్క సాగునీరు వృథా కాకుండా రైతులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలను బాగు చేయించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క కాలువలో కూడా పూడిక తీయలేదని, బిల్లులు మాత్రం చేసుకున్నారని మంత్రి ఈ సందర్భంగా విమర్శించారు. సోమశిల హైలెవెల్ కెనాల్‌పై దృష్టి పెడతామని, కావలి, ఉదయగిరి కాలువలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతాంగానికి నీరందే విధంగా చూస్తామన్నారు.

### కాపుభవన్ సమస్యలు తీరుస్తాం...

నెల్లూరులోని కాపు భవన్‌ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ ఇటీవల పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. తాను గతంలో మంత్రిగా ఉన్న సమయంలో కాపు భవన్‌కు స్థలాన్ని సేకరించి, దాని నిర్మాణానికి రూ.50లక్షల నిధులు విడుదల చేయించానని, ఆ తర్వాత తన కుమార్తెలు కూడా వారి సొంత డబ్బులు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాపు భవన్‌ను నిర్లక్ష్యం చేసిందని, ఆ స్థలాన్ని కొందరు కబ్జాచేసినట్లు కూడా తన దృష్టికి వచ్చిం దన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేయించి, కాపు భవన్ స్థలాన్ని తిరిగి ఇప్పిస్తామని కాపు నాయకులకు ఆయన మాటిచ్చారు.

# మానవత్వం చాటుకున్న వేమిరెడ్డి దంపతులు

- **కాళ్లు కోల్పోయిన మహిళకు ట్రై సైకిల్ వితరణ**



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మరోసారి మానవత్వం చాటుకున్నారు. రెండేళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాలెంకి చెందిన శోభ, టోల్ ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయింది. ఇటీవల ఆ విషయాన్ని తెలుసుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చలించిపోయి, వెంటనే ఒక్కరోజులోనే విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త ట్రై సైకిల్ ఏర్పాటు చేయించి, ఆ మహిళకు అందించారు.

# ఆనం సోదరుల ఆత్మీయ కలయిక!



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని, ఆయన సోదరుడు ఆనం వెంకట రమణారెడ్డి ఇటీవల కలుసుకున్నారు. ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం తనను నియమించిన సందర్భంగా నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆనం వెంకట రమణారెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకుని మంత్రి రామనారాయణరెడ్డి ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు.

# జడ్పీ సమావేశం..23న

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేది ఉదయం 10.30గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని జడ్పీ సీఇఓ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నెడ్‌క్యాప్, వ్యవసాయం, నీటిపారుదల, వైద్య ఆరోగ్యశాఖలపై సమీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# విఎస్‌యు ఉపాధ్యాయునికి పురస్కారం

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) బయోటెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.వి. ప్రభాకర్ 2024 సంవత్సరానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆయన ఆ అవార్డును స్వీకరించారు. విద్యారంగం, పరిశోధన రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన డాక్టర్ ప్రభాకర్ అంకితభావం, వినూత్న బోధనా విధానాలు, విద్యార్థుల సంక్షేమం పట్ల చూపించిన చిత్తశుద్ధితో ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది.

# జాతీయ ఖోఖోకి..కెఎన్ఆర్ విద్యార్థి



నెల్లూరు నగరంలోని కెఎన్ఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్ నవీన్ ఇటీవల ఖోఖోలో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో, ఆ విద్యార్థిని ఈనెల11న ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయిని గాయత్రి అభినందించారు. అండర్-17 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర జట్టులో నవీన్ స్థానం సాధించాడని, త్వరలో అయోధ్యలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనబోతున్నాడని వారు తెలిపారు.

# సాహిత్య పురస్కార సభ



నెల్లూరు టౌన్‌హాలులోని రీడింగ్‌రూమ్‌లో ఇటీవల ప్రముఖ రచయిత్రి పాతూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో, ఆమె తల్లి పాతూరి మాణిక్యమ్మ దశమ వార్షికోత్సవ సాహిత్య పురస్కార సభ ఘనంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.కుమార్‌రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, బ్రతికి ఉన్నప్పుడే తల్లిదండ్రులని వృద్ధాశ్రమాల పాలుచేస్తున్న నేటికాలంలో ప్రముఖ రచయిత్రి పాతూరి అన్నపూర్ణ, గత పదేళ్లుగా తన తల్లి పేరుతో సాహిత్యవేత్తలను సన్మానించి నగదు బహుమతి అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం, పాతూరి మాణిక్యమ్మ జాతీయస్థాయి సాహిత్య పురస్కారాన్ని 'అద్దం నా చిరునామా కాదు' కవితా సంపుటి రచించిన తోట నిర్మలారాణికి అందజేశారు. కార్యక్రమ అధ్యక్షులు ఏ.జయప్రకాష్, కవయిత్రి పాతూరి అన్నపూర్ణ, ఆమె కుటుంబసభ్యులతో పాటు పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద, పురస్కార న్యాయనిర్ణేత మందరపు హైమవతి తదితరులు పాల్గొన్నారు.




# భవన నిర్మాణ కార్మికుల ధర్నా

భవన నిర్మాణ కార్మికుల సంఘం, ఏఐటీయుసిల ఆధ్వర్యంలో ఈనెల 11న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. తమ సమస్యలు తీర్చాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పున:ప్రారంభించాలని వారు కోరారు. ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి గతంలో దారి మళ్ళించిన నిధులను రాబట్టి, తిరిగి బోర్డుకు జమచేయాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి పింఛను ఇప్పించాలన్నారు. ఇసుక ర్యాంపులను ప్రభుత్వమే నిర్వహించాలని, లేకుంటే స్థానిక సంస్థలకు అప్పగించాలని సూచించారు. ఏఐటీయుసి జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఎస్‌కె ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో క్రీడోత్సాహం

## క్రీడాజ్యోతి వెలిగించి నెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన మంత్రి ఆనం



ఆత్మకూరులో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఇటీవల ఉత్సాహంగా జరిగాయి. ఈ క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తొలుత క్రీడా జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. మార్చ్‌ఫాస్ట్‌తో క్రీడాకారులు మంత్రికి గౌరవ వందనం చేశారు. మూడు రోజుల పాటు ఆత్మకూరులో జరిగే ఈ క్రీడల్లో భాగంగా అండర్–19 బాలురు బాలికలు, అండర్–17 బాలురు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి హాజరైన 39 టీమ్‌లు, 546 మంది క్రీడాకారులు, 72 మంది కోచ్‌లు, మేనేజర్లతో క్రీడా ప్రాంగణం కళకళలాడింది.

విద్యార్థులందరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని, జాతీయస్థాయిలో మన రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని ఈ సందర్భంగా మంత్రి ఆనం ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన అత్యుత్తమ క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గౌరవ మర్యాదలు, ఉన్నత స్థానాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లు తమ ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. రాష్ట్రం నుంచి ఒలంపిక్ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన వారికి రూ. 7 కోట్ల రివార్డును ప్రకటించి సత్కరించాలని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని, త్వరలో పంజాబ్‌లోని లూథియానా, చత్తీస్‌గఢ్‌లలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో క్రీడాకారులు ముందుకు సాగాలన్నారు.



## వేమిరెడ్డి దంపతులకు వంటేరు సన్మానం

కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి ఇటీవల వేమిరెడ్డి దంపతులను నెల్లూరులోని వారి నివాసంలో సన్మానించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాధ్యతలు స్వీకరించడం, అదేవిధంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రంలో విదేశీ వ్యవహారాల కమిటీ సభ్యులుగా నియమితులు కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, వేమిరెడ్డి దంపతులకు శ్రీ వేంకటేశ్వరుని చిత్రపటం బహుకరించి గజమాలతో సత్కరించారు.



## బుచ్చిని సుందరంగా తీర్చిదిద్దుతా

బుచ్చిరెడ్డిపాళెం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆమె బుచ్చిలో పలుచోట్ల నిరుపయోగంగా ఉన్న మునిసిపల్, పంచాయతీ స్థలాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న పాత మార్కెట్‌ను విస్తరించాల్సిన అవసరం వుందన్నారు. మార్కెట్‌కు సమీపంలో కబ్జాదారుల నుంచి మున్సిపాలిటి స్వాధీనం చేసుకున్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే స్థానికులకు ఉపాధితో పాటు మున్సిపాలిటీకి ఆదాయం కూడా వస్తుందని సూచించారు.









జననం: 21.08.1930 నిర్యాణం: 19.11.2019

5వ వర్ధంతి

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు

(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి, మనుబోలు)

మాకు దూరమై నవంబర్ 19, 2024 నాటికి
ఐదేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..

ఆమె దివ్య ఆత్మకు మా సృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై

కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)

మనుమరాలు, మనుమడు
ప్రణీత అరవింద్, లోహిత్, యు.యస్.ఏ

మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై

మనుమరాలు - మనుమడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ

మునిమనుమలు, మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత కీర్తన లక్ష్మి & తనవ్

# కళ్యాణ వైభవం...!

## నిమిత్ - లోహిత



నెల్లూరుజిల్లా, కంపసముద్రం వాసి, ప్రస్తుతం బెంగళూరు నివాసి నారపరెడ్డి శ్రీధర్‌రెడ్డి - సరళల కుమారుడు **నిమిత్ - లోహిత**ల పరిణయం నవంబర్ 13వ తేదీ చిత్తూరులో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## శ్రీరామ - వివియా



నెల్లూరులోని సింహపురి సేవాసమితి ఆధ్వర్యంలో నడిచే జయభారత్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న ప్రముఖ వైద్యుడు సి.వి.సుబ్రహ్మణ్యం - రమణిల కుమారుడు **డాక్టర్ వెంకట శ్రీరామ - డాక్టర్ వివియా నాగదేవ్** (ముంబాయి వాస్తవ్యులు నరేష్ నాగదేవ్ - ప్రీతీ నాగదేవ్‌ల కుమార్తె)ల వివాహం నవంబర్ 8వ తేదీ ముంబాయిలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

## సురేష్ - కావేరి



పడారుపల్లి వాస్తవ్యులు చల్లా సుబ్బారావు (సుబ్బన్న) - కృష్ణవేణిల కుమారుడు **సురేష్‌కుమార్ - కావేరి** (పడారుపల్లి వాస్తవ్యులు కాకు కామయ్య - సౌమ్యల కుమార్తె)ల పెళ్ళి నవంబర్ 7వ తేదీ నెల్లూరులో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమ వితరణ

## సూళ్ళూరుపేట కళాశాలకు.. రూ. 27 లక్షలతో ఫర్నిచర్.. రెండు తరగతి గదుల నిర్మాణం

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ తన సామాజిక సేవను మరోసారి చాటుకుంది. సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు తరగతి గదులను (డెస్కులు, బెంచీలతో సహా) నిర్మించింది. ఇటీవల వాటిని ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంకుమార్‌కు అప్పగించారు. ఈ కళాశాలలో విద్యావసతుల కొరతను గుర్తించిన పరిశ్రమ యాజమాన్యం, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా 27 లక్షల రూపాయల వ్యయంతో అధునాతన తరగతి గదులను నిర్మించి, అందులో అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయడం విశేషం. దీంతో కళాశాల ఆధునిక వసతులతో సరికొత్త శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలోశ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, ఐమాప్ ప్రతినిధులు, శ్రీసిటీ ఫౌండేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# మంత్రి నారాయణను కలిసిన కొత్త ఛైర్మెన్లు

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఛైర్మెన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మంత్రి నారాయణను కలసి కృతజ్ఞతా పూర్వకంగా సన్మానించారు. 'మీ సహకారం వల్లే తనకు పదవి వచ్చిందని' కోటంరెడ్డి మంత్రి వద్ద సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా, ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ బోర్డు నెల్లూరు ఛైర్మెన్‌గా నియమితులైన బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను నెల్లూరు లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయనతో పాటు, బీజేపీ నాయకులు శాలువాలతో సత్కరించి సన్మానించారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఏసిఏ సబ్ సెంటర్‌కు మంచి రోజులు



అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసిఏ సబ్ సెంటర్‌ని ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ ఛైర్మెన్ విజయకుమార్ ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్ సెంటర్‌కి కావలసిన కాంక్రీట్ పిచ్, ఆస్ట్రోటర్ఫ్ వసతులను ఏర్పాటు చేసేందుకు, అలాగే స్థానిక డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో బాలికల క్రికెట్ కోసం వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని అన్నారు. నెల్లూరుజిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కొణిదల మునిగిరీష్, తిరుపతి జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి, జాయింట్ సెక్రెటరీ సతీష్‌యాదవ్, ఏసీఏ కోచ్ లవకుమార్, సబ్ సెంటర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న గ్రామ దేవత శ్రీ తాళమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మ వారి కృపకు పాత్రులయ్యారు. డి.శ్రీధర్‌రెడ్డి, లత కుటుంబసభ్యుల దాతృత్వంతో భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఈ పూజా కార్యక్రమాలు గ్రామదేవత ఆలయ కమిటీ ఛైర్మెన్ చిట్టెం శ్రీనివాసులుగౌడ్, కమిటీ సభ్యులు, ఆలయ ప్రముఖుల పర్యవేక్షణలో జరిగాయి.

# అబుల్ కలాం సంస్కరణలతోనే.. విద్యా వ్యవస్థ పటిష్టత

**- షేక్ రియాజ్ అహ్మద్**



మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో ఇటీవల భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి షేక్ మహబూబ్ బాషా అధ్యక్షత వహించగా, సంఘ గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య యోధుడైన అబుల్ కలాం ఆశయాలను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. నెట్‌వర్క్ ఫౌండర్ కాలేషా, సలహాదారులు అబ్దుల్ రహీం, పూర్వ అధ్యక్షులు, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, నెట్‌వర్క్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం వ్యాస రచన, డ్రాయింగ్, తెలుగు ఇంగ్లీష్‌లో స్పీకింగ్ కాంపిటేషన్ నిర్వహించి 9, 10 తరగతుల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నెట్‌వర్క్ కార్యదర్శి షేక్. షా నవాజ్ వందన సమర్పణ చేశారు.



జానకిరామ.. 39

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు

నాలాంటి వాడొకడు అందమైన పూలు పూస్తున్నదిగదా దాని పండ్లు ఇంకా బాగా రుచిగా ఉంటాయేమో అని తలచి అప్పటికే ఉన్న మధురఫలాలనిచ్చే మామిడి తోట నరుక్కొని మోదుగ వృక్షాలను నాటి శ్రద్ధగా పెంచుకొన్నాడట. చివరకు దాని పళ్ళుచూసి హతాశుడైనాడట! అలాంటి వాడిని నేను.

నవయువకుడిగా ఉన్నరోజులలో నా విద్యమీద నాకు ఉన్న వల్లమాలిన గర్వంతో గాఢాంధకారమావరించి, లోకులంతా నిదురిస్తున్న వేళ వర్ష ఋతువులో వేటకు బయలుదేరాను.

శబ్దవేది విద్యలో నా నైపుణ్యం చాలా గొప్పది అని జను లంతా పొగుడుతుంటే ఆ పొగడ్తల మాయలో పడి అడవిలో రాత్రివేళ ధనుర్బాణాలు ధరించి సంచరిస్తూ గమనిస్తున్నాను.

ఎక్కడ నుండో ఒక శబ్దం వినపడ్డది. చెవులు రిక్కించి ఆ శబ్దాన్ని శ్రద్ధగా ఆలకించాను.. సందేహం లేదు అది ఒక ఏనుగు నీళ్ళు త్రాగే శబ్దం.

మనసును పూర్తిగా అటువైపే కేంద్రీకరించాను.

ఆ శబ్దం, దాని ఉత్పత్తి స్థానం నా మనోనేత్రం ముందు స్పష్టంగా కనిపించాయి. ధనుస్సు ఎక్కుపెట్టి ఆ దిశగా పదునైన బాణమొకటి సంధించి విడిచాను.

ఆ బాణం లక్ష్యాన్ని తాకిన మరుక్షణం అయ్యో అయ్యో అని మనిషి అరిచినట్లుగా ఉంది. దగ్గరకు పోయి చూద్దును కదా, అది ఒక ముని బాలకుడి స్వరం! నేను విడిచిన బాణం అతని గుండెలను చీల్చివేసింది. ఆ బాలుడు నరకయాతన అనుభవిస్తూ కనపడ్డాడు. నేనెవరికి అపకారం చేశానని నన్ను బాణంతో కొట్టారు? అని అంటూ బాధతో మూల్గుతున్నాడు.

అతని వద్దకు వెళ్ళిన నన్ను చూసి, చనిపోతున్నందుకు నాకు బాధలేదు కానీ ముసలివారు, అంధులు అయిన నా తల్లితండ్రుల పరిస్థితి తలుచుకుంటే నాకు దిక్కుతోచటంలేదు అని బాధపడుతూ, దశరథా ఈ కాలిబాట వెంట వెళ్ళి వారిని తక్షణమే శరణు వేడు, లేకపోతే వారిచ్చే శాపానికి గురికావలసి వస్తుంది. అని పలికి నా చేతులలో ప్రాణాలు విడిచాడు.

భయం, భయంగా ఆ ముని బాలకుడి తల్లిదండ్రులను సమీపించి నా వలన తెలియక జరిగిన అపరాధం మన్నించమని వేడుకున్నాను.

విషయం తెలిసిన ఆ తల్లిదండ్రుల శోకం వర్ణనాతీతం! వారి కోరిక మీద వారి కుమారుడు పడిపోయిన ప్రదేశానికి తీసుకువెళ్ళగా, వారు అతని దేహాన్ని స్పృశిస్తూ, వారుకూడా మరణానికి దగ్గర అవుతూ ఉన్నవారివలే వణికిపోతూ, రాజా! మావలెనే నీవు కూడా పుత్రవియోగ దుఃఖంతో మరణించగలవు అని శపించి ప్రాణం విడిచిపెట్టారు.

కౌసల్యా! నేడు ఆ సమయమాసన్నమైంది.

నాకు కళ్ళు కనపడటంలేదు, దృష్టి మందగించింది.

యముని మహిషపులోహ ఘంటానాదం నా చెవులలో మారుమ్రోగుతోంది.

ఇక అందమైన నా రాముని ముఖం చూడగలిగే అదృష్టం నాకులేదు.

అయ్యో రామా, అయ్యో మహాబాహూ, అయ్యో నా దుఃఖ నాశకా, అయ్యో పితృప్రియా, అయ్యో మద్రక్షకా, అయ్యో నా కుమారా, ఎక్కడున్నావురా నీవు అంటూ గుండెలవిసేలా ఏడ్చిఏడ్చి నిద్రలోనే తుదిశ్వాస విడిచాడు దశరథుడు.

**హా రాఘవ మహాబాహో హా మమాయాసనాశన**
**హా పితృప్రియ మే నాథ హాద్య క్వాసి గతః సుత.**
**హా కౌసల్యే నశిష్యామి హా సుమిత్రే తపస్విని**
**హా నృశంసే మమామిత్రే (మమంఅమిత్రే)**
**కైకేయీ కులపాంసని.**

ఒక చక్రవర్తి అస్తమించాడు.

భానుడి కిరణాలు పుడమిని స్పృశిస్తున్నా రాజు ఇంకా కనులు తెరవలేదు. వందిమాగధులు స్తోత్రపాఠాలు మొదలు పెట్టారు.. అయినా మహారాజు బయటకు రాలేదు.

దశరథుడి భార్యలు ఆయనను నిద్ర లేపటానికి ప్రయత్నం చేశారు. శాశ్వతనిద్రలోకి జారుకున్న ఆయన ఎలా నిద్దుర లేస్తాడు?

రాణులకు అర్థమయ్యింది ఇక తమ రాజు లేవడని! ఒక్క సారిగా రాణివాసమంతా గొల్లుమంది. ఈ వార్త కైకకు చేరింది. ఆవిడ కౌసల్యా మందిరానికి వచ్చి విలపింపజొచ్చింది.

ఆవిడను చూడగనే అందరి మనస్సులో ఒక రకమైన ఏహ్యా భావం ప్రవేశించింది. భర్త తల ఒడిలోపెట్టుకుని కూర్చున్న కౌసల్య, కైకను చూడగనే పాపాత్మురాలా నీ కళ్ళు చల్లబడ్డాయా!



నీ కోరిక తీరిందిగదా! అడ్డేలేకుండా ఇక నీవు రాజ్యాన్ని ఏలుకో! నా కొడుకును నానుంచి దూరం చేశావు, ఇప్పుడు మగడు కూడా శాశ్వతంగా దూరమయ్యాడు.

ఈ విధంగా ఏడుస్తున్న ఆడువారినందరినీ మంత్రులు ఆయన శరీరం వద్దనుండి దూరంగా తీసుకొనిపోయారు. కొడుకులెవ్వరూ దగ్గరలేని కారణం చేత ఆయన అంతిమ సంస్కారాలు ఎలా చేయాలో వారికి అర్థం కాలేదు.

వశిష్ట మహాముని ఆజ్ఞమేరకు భరతుడు వచ్చేవరకు రాజు శరీరాన్ని తైలద్రోణిలో (నూనెతో నిండిన పెద్ద పాత్ర) ఆయన అంతకుముందు పడుకున్న శయనము మీదనే ఉంచాలని నిశ్చయించి ఆ ప్రకారం చేశారు.

మంత్రులంతా వశిష్ట మహర్షితో కూడి సమావేశమై రాజు లేని రాజ్యంలో అరాచకం ప్రబలుతుంది కాబట్టి ఏం చేయాలా అని ఆలోచించి, సిద్ధార్థుడు, జయంతుడు, అశోకుడు, విజయుడు, నందనుడు అనే దూతలను పిలిచి మీరు అతిశీఘ్రంగా కేకెయ రాజ్యానికి వెళ్ళి భరతుడిని వెంటనే తీసుకొని రండి, కానీ.. ఇక్కడ జరిగిన విషయాలేవీ అక్కడ ప్రస్తావించవద్దు. వెళ్ళే టప్పుడు మామూలుగా ఏవిధమైన బహుమతులు ఎప్పుడూ కేకెయరాజుకు తీసుకు వెళతారో అవికూడా వెంట తీసుకొని వెళ్ళండి. ఎవరికీ ఏ విధమైన అనుమానం కలుగకుండా ప్రవర్తించండి అని ఆదేశించారు.

వశిష్ట మహర్షి ఆజ్ఞననుసరించి వారు వెంటనే అతిశీఘ్రంగా ప్రయాణించగల అశ్వాలను అధిరోహించి కేకెయ రాజ్యం వైపుగా సాగిపోయారు.

భరతుడిని తీసుకురావటానికి బయలుదేరిన ఆ దూతలు అతి వేగంగా ప్రయాణం చేస్తున్నారు.

వారు ముందుగా అపరతాల పర్వత దక్షిణభాగం దాటారు.

ఆ తరువాత అపరతాల, ప్రలంబ పర్వతాల మధ్య ప్రవ హించే మాలినీ నది వెంట ఉత్తరంగా ప్రయాణం చేసి మరల పడమరవైపు తిరిగారు.

వారు అలా హస్తినాపురం చేరి అక్కడ గంగ దాటి మరల పడమరగా ప్రయాణం చేసి కురుజాంగల మధ్యదేశం మీదుగా పాంచాలము చేరి, అక్కడ నుండి ప్రయాణం చేసి శరదండా నదిని దాటి ఇంకా వేగంగా ప్రయాణం చేశారు.

ఆ నదీ తీరం మీదున్న సత్యోపయాచన అనే దివ్యవృక్షానికి ప్రదక్షిణం చేసి కులింగా నది దాటారు.

ఎక్కడా ఆగటంలేదు, అలసట లక్ష్యపెట్టకుండా అక్కడనుండి అభికాల అనే గ్రామం చేరి అక్కడ ఇక్షుమతీ నదిని దాటి, అక్కడ నుండి బాహ్లికదేశం మీదుగా సుదామ పర్వతం చేరారు.

అక్కడ నుండి ఇంకా వేగంగా ప్రయాణించి నాల్గవ రోజు రాత్రికి కేకెయ రాజధాని గిరివ్రజపురం చేరారు.


ఆ రాత్రి నిదురించిన భరతుడికి తెల్లవారుఝామున ఒక పీడకల వచ్చింది. వెంటనే లేచి కూర్చున్న ఆయన మనసులో చాలా దుఃఖించి పరితపించసాగాడు.

ఆయన పరితాపం గ్రహించిన స్నేహితులు ఆయనకు రకరకాల కథలు చెపుతూ మనసులో కలిగిన ఆ ఖేదాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆయన మనస్సెందుకో కుదుట పడటంలేదు. అప్పుడు ఉండబట్టలేక కొందరు మిత్రులు కారణమడిగారు. అందుకు ఆయన తనకు వచ్చిన కల ఎట్లాంటిదో చెప్పాడు.

నా తండ్రి మట్టికొట్టుకుపోయిన శరీరంతో జుట్టు విర బోసుకుని పర్వతశిఖరం మీదనుండి ఆవుపేడతో నిండిన గోతిలో పడిపోయినట్లు, అందులోనే మునిగితేలుతూ మాటిమాటికీ పిచ్చి వాని వలే నవ్వుతూ దోసిళ్ళతో నూనె తాగుతున్నట్లుగా ఉండి నువ్వులు కలిపిన అన్నం తింటూ మాటిమాటికీ తల వాలుస్తూ నూనెలో మునిగిపోయాడు.

నా తండ్రి ఎర్రటి మాలలు ధరించినట్లుగా ఎర్రటి గంధం వంటికి పూసుకొన్నట్లుగా గాడిద నెక్కి దక్షిణదిక్కుగా, ఒక రాక్షసి లాక్కొని పోతున్నట్లుగా కనపడినాడు. ..(సశేషం)


# ట్రంప్‌తో భారత్‌కు లాభమా? నష్టమా?



ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించబోతున్న నేపథ్యంలో భారత్‌కు, భారతీయులకు లాభమా, నష్టమా అన్న చర్చ మొదలయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా ప్రభావం విస్మరించలేనిది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ఆర్థికంగా, సైనిక పరంగా బలీయమైన శక్తిగా ఎదిగింది. ఆ యుద్ధం ప్రారంభంలో మిత్రపక్షాలకు ఆయుధ సరఫరా మాత్రమే చేసిన అమెరికా పెరల్ హార్బర్‌పై జపాన్ దాడి కారణంగా నేరుగా యుద్ధరంగంలోకి అడుగుపెట్టింది. జపాన్‌పై అణుబాంబులు వేసి ప్రపం చాన్ని భయకంపితుల్నిచేసింది. అప్పటి నుంచి ఎదురులేని శక్తిగా ఎదిగింది. ఈ యుద్ధం గురించి ఇక్కడ ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే యుద్ధానికి–ఆర్థిక వ్యవస్థకు సంబంధం ఉంది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే సంబంధిత దేశాల ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నం అవుతాయి. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం నాటికి ఆర్థికంగా బలోపేతంగా ఉన్న ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, జపాన్ తదితర దేశాలు ఆ తర్వాత కుదేలయిపోయాయి. ముఖ్యంగా జపాన్ కోలుకోవడానికి చాలా సంవత్సరాలు పట్టింది. యుద్ధంలో పెద్దగా పాల్గొనని అమెరికా ఆర్థికంగా భద్రంగా ఉంది. ఇటీవల పశ్చిమాసియాలో యుద్ధాల్ని పరిశీలిస్తే గాజా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి 350 ఏళ్లు పట్టొచ్చని ఐక్యరాజ్యసమితి నివేదిక ఒకటి పేర్కొంది. ఇతర దేశాల యుద్ధ వ్యవహారాల్లో నేరుగా తలదూరిస్తే ఆర్థికంగా నష్టపోతామన్న ఎరుక ట్రంప్‌కు ఉంది. అందుకే ఆయన తరచూ ఇతర దేశాల యుద్ధాల్లో అమెరికా పాల్గొనే విషయంలో విముఖ వైఖరి స్పష్టంగా ప్రదర్శిస్తుంటారు. పైకి బలమైన ఆర్థిక శక్తిగా అమెరికా కనిపిస్తున్నా అంతర్గతంగా అమెరికా ఆర్థిక వ్యవస్థలో చాలా లోటుపాట్లున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి, అమెరికన్ల ప్రయోజనాలను కాపాడడానికి ఆయన గుర్తించిన రెండు ప్రధాన అంశాల్లో ఒకటి– ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, రెండు– వలసల విధానం.

ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం అనవసరం అన్న ట్రంప్ వైఖరి భారత్ వైఖరికి అనుగుణంగానే ఉంది. పైగా భారత ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య సత్సం బంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాలు, ముఖ్యంగా వాణిజ్య సంబంధాల విషయంలో ట్రంప్ విధానాలు భారత్‌కు మేలుచేసే విధంగానే ఉం డొచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికాకు సవాల్ విసురుతున్న చైనాను నియం త్రించాలన్న ట్రంప్ వైఖరి భారత్‌కు మేలు చేసేదే. మరోవైపు రష్యాతో భారత్ మైత్రిని ట్రంప్ వ్యతిరేకించడం లేదు. పైగా రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల ట్రంప్ వైఖరి సానుకూలంగా ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశం.

ద్వైపాక్షిక అంశాల్లో ట్రంప్ వల్ల భారత్‌కు మేలు జరిగే అవకాశాలు ఎక్కువగానే ఉన్నప్పటికీ, అమెరికాలో నివసిస్తున్న భారతీయులు, అమెరికాలో స్థిరపడాలను కుంటున్న భారతీయుల్లో మాత్రం కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఎందుకంటే వలసలపై ట్రంప్ వెలిబుచ్చుతున్న అభిప్రాయాలు కాస్త కఠినంగానే ఉన్నాయి. హెచ్1బి వీసాలపై వస్తున్న విదేశీయుల వల్ల, వారిపై ఆధారపడి వస్తున్న జీవిత భాగస్వాముల వల్ల అమెరికాలోని స్థానికుల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్న గిల్లుతున్నాయని ఆయన బలంగా విశ్వసించడమే కాకుండా గత ఎన్నికల్లోనూ, మొన్నటి ఎన్నికల్లోనూ ప్రచారాస్త్రంగా వాడుకున్నారు కూడా. అక్రమ వలసలను నిరోధిస్తానని ఆయన స్పష్టం చేస్తున్నారు. నైపుణ్య ఆధారిత వీసాలకు తాను విముఖం కాదని చెబుతూనే హెచ్1బి వీసాల కిందకు వచ్చే ఉద్యోగాల్లో అధిక వేతనం చెల్లించాలని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ ఉద్యోగాలకు అధిక వేతనం చెల్లించే పరిస్థితి వస్తే అది భారతీయ హెచ్1బి ఆశావహులకు నష్టమే. ఎందుకంటే తక్కువ వేతనాలకు భారతీయుల లభ్యత ఉంది కాబట్టే కంపెనీలు హెచ్1బి వీసా కింద భారతీయులను నియమించుకుంటున్నాయి. వేతనాలు పెంచాల్సిన పరిస్థితి వస్తే కంపెనీలకు భారతీయులైనా, అమెరికాలోని స్థానికులైనా ఒకటే. మరోవైపు హెచ్1బి వీసాపై అమెరికాలో ఉద్యోగం చేసే వారి జీవిత భాగస్వాములు హెచ్4 వీసా కింద ఉద్యోగం చేయడానికి వీలు కల్పించే ఈఏడీ– ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ నిబంధనపై ట్రంప్ వైఖరి భారతీయులకు ఆందోళనకరంగా ఉంది. ట్రంప్ కిందటిసారి అధికారంలో ఉన్నప్పుడు హెచ్4 వీసా కింద ఉద్యోగం చేయ డానికి వీలుకల్పించే ఈఏడీని రద్దు చేయడానికి రంగం సిద్ధం అయింది. అంతలోనే బైడెన్ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ట్రంప్ అధికారం చేపట్టనుండడంతో హెచ్4 వీసాదారుల్లో ఆందోళన నెలకొంది. హెచ్4 వీసాదారులకు ఈఏడీ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే కేవలం ఉద్యోగం చేసుకోవడానికి అనుమతి దొరకడమే కాకుండా ఈఏడీ వల్ల సామాజిక భద్రతా సంఖ్యను పొందడానికి వీలవుతుంది. బ్యాంకు ఖాతాను తెరవడానికి, డ్రైవింగ్ లైసెన్సు పొందడానికి వీలవుతుంది. మొత్తంగా అమరికా సమాజంలో కలవడానికి ఉపకరిస్తుంది. ఈ రెండు వీసాలపై ట్రంప్ ఎలాంటి వైఖరిని స్పష్టం చేస్తారో వేచి చూడాలి. భారతీయులకు నష్టం కలిగించని విధంగా వీసాల విధానం ఉండేలా ప్రధాని మోదీ యంత్రాంగం దౌత్యం నడపాలి. అదే సమయంలో యువతరం, తల్లి దండ్రులు కూడా దీర్ఘకాలం విదేశాలపై ఆధార పడకుండా స్వదేశంలోనే మెరుగైన అవకాశాలు వెదుక్కో వడంపై, వాటిని సృష్టించుకోవడంపై దృష్టిపెట్టాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# జగన్ జగడం!

(మొదటిపేజీ తరువాయి)

పులివెందుల పులి అన్న క్రేజ్ ఉంది. సాక్షాత్తూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఎదిరించాడన్న పేరుంది. కేసులు పెట్టినా, జైలుకి పంపినా జంకని మొండితనముంది. ఎవరికీ భయపడని వ్యక్తిత్వం, ఓడిపోయినా వెన్ను చూపని ధీరత్వం ఉన్నాయి. ఆ గుణాలే జగన్‌ని 2019లో ముఖ్యమంత్రిని చేశాయి.

అపరిపక్వ పాలన, అసంబద్ధ నిర్ణయాలు, అసమర్థుల చేతికి అధికారం, అనాలోచిత అడుగులు, అపార ఆత్మవిశ్వాసం... ఇవన్నీ కలగలసి అదే జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో అధికారం నుండి దించేశాయి. అయినా ఆయన శైలి మారలేదంటున్నారు విశ్లేషకులు. తాను చెప్పిందే వేదం.. తాను చేసిందే శాసనం అన్న తరహాలో ఇప్పటికీ ఆయన వ్యవహరిస్తున్న తీరు ఆయనకి, పార్టీకి ఇంకా నష్టం చేస్తున్నాయని వైసీపీ శ్రేణులే అభిప్రాయపడుతున్నారు.

గత అయిదేళ్లలో జగన్ పాలన ఎలా సాగింది, ఇప్పుడు ఆయన ఏం మాట్లాడుతున్నారు అన్న విషయాన్ని ఒక్కసారి గమనిస్తే....

★ వైసీపీ పాలనలో రాష్ట్రంలో దౌర్జన్య కాండ కొనసాగింది. ఆ పార్టీ నాయకులు అరాచకాలు చేశారు. ఆ ప్రభుత్వంలోని మంత్రులు బూతు పురాణాలు వల్లించారు. అవన్నీ జగన్ మర్చిపోయారు. ప్రభుత్వం వచ్చిన వారంలోపే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించడం మొదలుపెట్టారు.

★ ప్రజలు తన పార్టీకి కేవలం 11 సీట్లే ఇచ్చారన్న సంగతి జగన్ విస్మరించారు. టీడీపీ అధికార పగ్గాలు చేపట్టి నెల గడవక ముందే మాటకొస్తే బాబుని రాజీనామా చేయమంటున్నారు. తొందరలో మళ్ళీ తామే అధికారంలోకి వస్తామంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

★ "ఆంధ్రా ప్రజలు ఈసారి మీకు ప్రతిపక్షహోదా కూడా ఇవ్వరు" అని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబుని జగన్ ఎద్దేవా చేశారు. ఆ సంఘటన సైతం జగన్‌కి గుర్తు రావడంలేదు. ఇప్పుడు తనకి ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానంటున్నారు. ప్రతిపక్ష హోదా ఇప్పించమని ఆయన కోర్టుని కూడా ఆశ్రయించారు.

★ అయిదు నెలల క్రితం వరకూ అయిదేళ్ళు ఆంధ్రాని ఆయనే పాలించారు. ఆ విషయం కూడా జగన్‌కి గుర్తులేదు. రాష్ట్రంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని అప్పుడే దుమ్మెత్తి పోస్తున్నారు.

★ తాను అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినవారిని లోపల తోయించారు. లాఠీలతో తోమించారు. ఆ సంగతి కూడా ఆయన మర్చిపోయారు. సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టడం అన్యాయం అంటూ కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారు.

★ సాక్షాత్తూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సహా ఆ పార్టీలోని బడా లీడర్లందరి పైనా, అక్రమ - అవినీతి కేసులు బనాయించారు. వాళ్ళందరినీ అరెస్టు చేయించి పోలీసు ట్రీట్మెంట్ రుచి చూపించారు. ఆ సంగతి సైతం జగన్‌కి జ్ఞాపకమే రావడంలేదు. రాష్ట్రంలో రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయని, తమ పార్టీ నేతలని అక్రమంగా కేసులలో ఇరికిస్తున్నారని ప్రెస్‌మీట్లు పెట్టి స్టేట్‌మెంట్లు గుప్పిస్తున్నారు.

★ జగన్ రాజ్యంలో మద్యం, మైనింగ్, మాదకద్రవ్యాల మాఫియా వేళ్ళూనుకుంది. సహజ వనరుల దోపిడీ అడ్డూ ఆపూ లేకుండా కొనసాగింది. పార్టీ అగ్రనాయకులే వేల కోట్లు దోచుకున్నారు. అవన్నీ గత ముఖ్యమంత్రికి గుర్తులేవు. కూటమి ప్రభుత్వం సహజ వనరులని దోచేస్తోందని, ఆ పార్టీల నాయకులు మద్యం వ్యాపారాలతో ప్రజల జేబులని, ఆరోగ్యాలని కొల్లగొడుతున్నారని జగన్ విమర్శల బాణాలు సంధిస్తున్నారు.

ఇలా చెప్పుకుంటూ వెళ్తే... జగన్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు చాలానే ఉన్నాయని ఒక వైసీపీ మాజీ బడా నేత అభిప్రాయపడ్డారు. జగన్ తన నివాసం కోసం నిర్మించుకున్న అత్యంత విలాసవంతమైన 'రిషికొండ కోట', సాక్షి కోసం కట్టిన 26 కార్యాలయాల భాగోతం ఎన్నికల ముందే బయటపడుంటే ఆయనకి ఆ పదకొండు సీట్లు కూడా వచ్చేవి కాదని ఆయన చెప్పడం గమనార్హం.

## గతం మరచి... వ్యూహం విడిచి...!

నిజం చెప్పాలంటే... జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా గతం మర్చిపోయాడంటున్నారు విశ్లేషకులు. ఆయన పరిపాలన సాగించిన విధానాన్ని ఒక్కసారి ఆయనే వెనక్కి తిరిగి చూసుకుంటే జగన్ ఈ విధంగా వ్యవహరించేవారే కాదని చెప్తున్నారు. అధికార పక్షాన్ని ఎలా ఎదుర్కోవాలన్న వ్యూహం విడిచి, ఇలా అసెంబ్లీకి మొహం చాటేసేవారు కాదని అభిప్రాయపడుతున్నారు. తాను ఒక మాజీ ముఖ్యమంత్రిని, ఒక పార్టీకి అధ్యక్షుడిని అన్న విషయాలు కూడా విస్మరించి చిన్నపిల్లవాడిలా మారాం చేస్తున్నట్లుందంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తన ఉనికిని ప్రదర్శించుకోవడానికి 'జగడాన్ని' జగన్ తన అస్త్రంగా చేసుకున్నారని సీనియర్ రాజకీయవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆయన చాలా మొండివాడని, ఊహించని ఓటమిని ఘోర పరాభవంగా భావించి ఇప్పుడు జగమొండిగా మారి ప్రజాక్షేత్రంలో తన సచ్ఛీలతని ప్రదర్శించుకోవాలని చూస్తున్నాడని అంటున్నారు. అలాంటి పోకడ మంచికంటే చెడే ఎక్కువ చేస్తుందన్న విషయాన్ని ఆయన తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

ఇప్పటికైనా ఆయన తన వ్యూహం మార్చుకోవాలని, వివేకవంతమైన విమర్శలతో, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని సూచిస్తున్నారు. తాను శాసనసభ సభ్యుడైన తరువాతే ముఖ్యమంత్రి అయ్యానన్న విషయాన్ని గుర్తుంచుకుని, చట్ట సభలకి గౌరవం ఇచ్చి అసెంబ్లీకి వెళ్లి తన పోరాటం సాగించాలని మేధావులు అంటున్నారు. ఆయనకి ప్రతిపక్షహోదా ఇచ్చినంత మాత్రాన అసెంబ్లీలో ఆయన బలం పెరగదని, ఆయన ఏ హోదాలో చట్ట సభలకి వెళ్లినా ఆయన వెనుక ప్రస్తుతానికి ఉంది ఆ పదిమంది అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అంటున్నారు. ఇలా జగమొండిగా వ్యవహరించి అధికారపార్టీతో జగడం పెట్టుకుంటే... ఆయన వెనుక ఆ పదిమంది కూడా మిగలరేమో అన్న సందేహాన్ని మేధావులు వ్యక్తం చేస్తున్నారు...!

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు తేవాలి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



అమాయకులైన గిరిజనులు అనాదిగా ఎదుగుబొదుగూ లేక, నిత్యం అనేక అవస్థలు పడుతున్నారని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు తేవాలని మాజీమంత్రి..సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల వెంకటాచలం మండలం చెముడుగుంటలో నిర్వహించిన గిరిజనుల ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక(గిరిజనుల సదస్సు)లో జిల్లా కలెక్టర్ ఆనంద్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజలతో కలిసి ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన గిరిజనుల నుంచి వారు సమస్యల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి, గిరిజనుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు లేవని, కొంతమందికి ఉన్నా ప్రభుత్వ పథకాలు తమకు అందడం లేదని గిరిజనులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి చెప్పారు. వైకాపా పాలనలో గిరిజనుల కష్టాలు పట్టించుకోకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయని, గిరిజనులు భారీ సంఖ్యలో ఇక్కడికి వచ్చారంటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోందని ఆయన అన్నారు. వైకాపా వారు ఐటీడీఏని నిర్వీర్యం చేయడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా నిలిపేశారని, దాంతో గిరిజనుల ఇబ్బందులు అన్నిన్ని కావని అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దాదాపు 45 వేల మంది గిరిజనులున్నారని, అత్యంత పేదరికంలో ఉన్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని చెప్పారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ ప్రభుత్వంలో వారి భూములను కూడా కొందరు పెత్తందారులు కాజేశారని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. అర్హత ఉన్నప్పటికీ అమాయకత్వంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. గతంలో ఐటీడీఏ పీఓగా పని చేసిన నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు గిరిజనుల సమస్యలు - పరిష్కారంపై సంపూర్ణ అవగాహన ఉందని, కలెక్టర్‌తోపాటు జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులు కూడా ఈ వేదికపై నుంచి గిరిజనుల వినతులు స్వీకరించడం శుభ పరిణామమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో గిరిజనులకు సంబంధించిన సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామన్నారు.

# శ్రీ సాయి సచ్చరిత్ర శోభాయాత్ర



నెల్లూరులోని బాలాజీనగర్ శివార్లల్లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 10న శ్రీ సాయి సచ్చరిత్ర శోభాయాత్ర కన్నులపండువగా జరిగింది. షిరిడీలో జరుగుతున్న విధంగా, ఇక్కడ కూడా దాదాపు 5 వందల మంది సాయి భక్తులు శ్రీ సాయి సచ్చరిత్ర గ్రంథాన్ని తలమీద పెట్టుకుని, శ్రీ సాయి నామోచ్చరణలతో పురవీధుల్లో చేసిన ప్రదర్శన భక్తాదులందరినీ బాగా ఆకట్టుకుంది. శ్రీ సాయి మాలధారణ - షిరిడీ యాత్ర సందర్భంగా జరిగిన ఈ వేడుకలో భక్తులు 'శ్రీ సాయి జయసాయి జయజయ సాయి' అంటూ ఈ కార్యక్రమాన్ని అమోఘంగా నిర్వహించారు. అద్దాలమందిరం ఛైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో మూడవసారి జరిగిన ఈ శోభాయాత్రలో పాబోలు రామ సుబ్బయ్య, సాయి భక్తబృందాల వారు పాల్గొన్నారు.

# దగదర్తి పెద్దాయన..ఇక లేరు

## తాళ్ళూరు రమణయ్యనాయుడు అస్తమయం



నెల్లూరుజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మాజీ ఛైర్మన్, ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, ప్రజాసేవే పరమార్థంగా భావిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జీవితాంతం కృషిచేసిన.. సీనియర్ నాయకుడు.. 'దగదర్తి పెద్దాయన'.. తాళ్ళూరు రమణయ్యనాయుడు(81) ఇక లేరు. ఈనెల 11వ తేదీ కార్తీక సోమవారం పర్వదినం రోజున ఆయన శివైక్యం చెందారు. కొంతకాలంగా ఆయన హైదరాబాద్‌లో ఉన్న తన చిన్నకుమారుడు రవిప్రసాద్ నాయుడు వద్ద ఉండేవారు. అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు.

ప్రజలకు సేవచేయాలనే ఆకాంక్షతో, రాజకీయాలపై ఆసక్తితో 1981 ప్రాంతాల్లో రమణయ్యనాయుడు రాజకీయరంగంలోకి ప్రవేశించారు. అప్పట్లో అల్లూరు నియోజకవర్గంలో ఉన్న దగదర్తి సర్పంచ్‌గా ఎన్నికై, అందరితో ఆత్మీయంగా ఉంటూ, వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటూ ప్రజలకు చేరువయ్యారు. ఆ తర్వాత, దగదర్తి పీఏసీఎస్ ప్రెసిడెంట్‌గా మూడుసార్లు ఎన్నికై రైతులకు కూడా ఎనలేని సేవలందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా రెండుసార్లు స్థానం పొందారు. ఆయన సేవలు జిల్లాస్థాయిలో గుర్తింపుకు వచ్చాయి. ఆ సేవాభావమే ఆయన్ను జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి అధ్యక్షుణ్ణి చేశాయి. జిల్లాస్థాయిలో ఆ బాధ్యతలను కూడా ఆయన సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలందుకున్నారు. తాను ఏస్థాయిలో ఉన్నా ప్రజలను, రైతాంగాన్ని విస్మరించేవారు కాదు. దగదర్తిలో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి తన సొంత ధనాన్ని వెచ్చించి, రైతులకు అండగా నిలిచారాయన. ఒక్కమాటలో చెప్పాలంటే, దగదర్తి మండల ప్రజలకు రాజకీయంగానే కాక, అన్ని విషయాల్లోనూ ఆయన పెద్దదిక్కుగా ఉండేవారు. ఆ మండలానికి సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించి, ప్రజల అభిమానాన్ని పొందారు. పాత అల్లూరు నియోజకవర్గానికి, ఇటు కావలి నియోజకవర్గ ప్రజానీకానికి కూడా ఆయన అందుబాటులో ఉంటూ ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ప్రజలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చేవారు.

ఆయన మరణంతో వారి కుటుంబసభ్యులతో పాటు, దగదర్తి మండల ప్రజలు శోకతప్తులయ్యారు. దగదర్తిలో ఈనెల 13న ఆయన అంత్యక్రియలు జరిగాయి. అనేకమంది ప్రముఖులు, రాజకీయనాయకులు, పెద్దసంఖ్యలో ప్రజలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి కన్నీటి నివాళులర్పించారు.

ఏదేమైనా, పాతతరం నుంచి మంచి నాయకునిగా ఎదిగి, ప్రజాసేవే పరమార్థంగా భావించి ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసిన జనం మనిషి..రమణయ్యనాయుడి అస్తమయం బాధాకరం. ఆయన మృతికి చింతిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.. 'లాయర్'!...

## శ్రీసిటీలో 'సైబర్' మోసాలపై..
# అవగాహన సదస్సు



తిరుపతి జిల్లా పోలీసు శాఖ, సైబర్ నేర విభాగం, శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక వివిధ పరిశ్రమల ఐటి, మానవ వనరుల మేనేజర్‌లకు శ్రీసిటీలో 'సైబర్ క్రైమ్–సైబర్ సెక్యూరిటీ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ రకాల సైబర్ నేరాలు, బెదిరింపులు, నివారణ చర్యలు, సంబంధిత అంశాలపై హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్ నరసింహారావు వివరించారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ అవగాహన సదస్సు నిర్వహణకు శ్రీసిటీని ఎంపిక చేసినందుకు శ్రీసిటీ సెక్యూరిటీ, విజిలెన్సు విభాగాధికారి వై.రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ, తిరుపతి పోలీసు సూపరింటెండెంట్ చొరవతో జిల్లావ్యాప్తంగా వినియోగదారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలి, పని ప్రదేశాలు మరియు ఇంటివద్ద ఇంటర్నెట్‌ను ఎలా సురక్షితంగా ఉపయోగించాలి వంటి ప్రాథమిక సైబర్ సెక్యూరిటీ అంశాలపై ఈ సదస్సు అవగాహనను పెంచుతుందని ఆయన చెప్పారు. సైబర్ బెదిరింపులు, ఆర్థిక మోసాల వ్యూహాలు, కంప్యూటర్ హ్యాకింగ్‌తో పాటు పెరుగుతున్న డిజిటల్ విజిలెన్స్ అవసరాన్ని ఈ సదస్సులో నరసింహారావు ప్రస్తావించారు. సైబర్ నేరాలలో ఆర్థిక నేరాలది అగ్రస్థానంగా ఉందని, ఇందుకోసం వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుండి వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుంటాయని తెలిపారు. 'ర్యాన్సమ్‌వేర్' వంటి సైబర్ అటాక్‌ల గురించి వివరిస్తూ, కార్పొరేట్ డిజిటల్ ఆస్తులు లక్ష్యంగా దీనిని వినియోగిస్తూ కంపెనీలు, వ్యక్తుల నుండి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తారని వివరించారు. దీనిని అరికట్టేందుకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారంతో భద్రతా వ్యవస్థలను సిఫార్సు చేశారన్నారు. శ్రీసిటీ సీఐ బి.వి.శ్రీనివాసులు, శ్రీసిటీలోని పరిశ్రమలకు చెందిన 120 మంది హెచ్‌ఆర్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో..
# 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానిక్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భారత సాంకేతిక విద్యాసంస్థ ఏఐసీటీ సహకారంతో నిర్వహించిన 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' తరగతులు ఇటీవల ముగిశాయి. తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 60 మందికి పైగా అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు ముఖ్యఅతిథిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరువనంతపురం మెటలర్జీ విభాగం ఆచార్యులు డాక్టర్ కె.శివప్రసాద్, డాక్టర్ ఆర్ముగం (ఐఐటి మద్రాస్ చెన్నై) సి.హేమంత్‌కుమార్ (ప్రోగ్రాం మేనేజర్ హైటెక్ ప్రాజెక్ట్స్–బెంగళూరు) పాల్గొన్నారు. డాక్టర్ కే.శివప్రసాద్ 'క్యారక్టరైజేషన్ టూల్స్ ఇన్ ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అనే అంశంపై ప్రసంగించగా, డాక్టర్ మురిగియన్ అమృతలింగం 'చాలెంజెస్ అండ్ అడ్వాన్సస్ ఇన్ వైర్ ఆర్క్ అడ్డేటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' అనే అంశంపై ప్రసంగించారు. ముగింపు సదస్సులో హేమంత్‌కుమార్ మాట్లాడుతూ, కంపోసిట్ మెటీరియల్స్ ఉపయోగించి స్పేస్, ఆటోమొబైల్ రంగాలలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ఎన్నో విడిభాగాలను ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ దిశగా ఇంకా ఎన్నో పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం, హేమంత్‌కు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి మెమెంటో బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్, సహకో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ నలుగురికీ పదవులు

(మొదటిపేజీ తరువాయి)

### సమర్ధతకి..సముచిత స్థానం!

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ఇటీవల నామినేటెడ్ పదవుల కేటాయింపుకు పెద్ద కసరత్తే జరిగింది. సమర్ధులకి సముచితస్థానం అనే రీతిలో నేతల ఎంపిక సాగింది. వారిలో జిల్లాకుచెందిన నలుగురు నాయకులకు చోటు లభించడం విశేషం. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఛైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మరోసారి అవకాశం దక్కించుకున్నారు. ఆంధ్రా ఆక్వాకల్చర్ డెవలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా ఆనం వెంకటరమణారెడ్డిని నియమించారు. ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కోవూరు నియోజకవర్గానికి చెందిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి బాధ్యతలు అప్పజెప్పారు. వీరందరికీ కీలక పదవులు లభించడంతో జిల్లాలోని టీడీపీ–బీజేపీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

వైకాపా ప్రభుత్వ తీరును దుయ్యబట్టడంలో, వారి అక్రమాలపై ధ్వజమెత్తడంలో నగరంలో కోటంరెడ్డి శీనయ్య ముందు వరసలో ఉన్నారు. గడచిన అయిదేళ్ళు శీనయ్య తన గళాన్ని బలంగానే వినిపించారు. మూడు దశాబ్దాలకిపైగా కోటంరెడ్డి జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. తెలుగుదేశం నాయకునిగా, బాలయ్య అభిమానిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కూడా 'నుడా' ఛైర్మన్‌గా ఉన్నారు. వైకాపా వచ్చాక బోలెడన్ని కేసులుపెట్టి వేదించినా ఆయన తలొగ్గలేదు. పార్టీ అంటే ప్రాణంపెట్టే శీనయ్యకి రెండోసారి 'నుడా' ఛైర్మన్ పదవిని కట్టబెట్టడం సముచిత నిర్ణయం.

### ఆనం వెంకటరమణారెడ్డి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆనం వెంకటరమణారెడ్డి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ, అధికారంలో లేనప్పుడు పార్టీకి అండగా నిలిచారు. వైకాపా నాయకుల అక్రమాలను, దోపిడీలను నిర్భయంగా, నిర్మొహమాటంగా బయటపెట్టేవారు. తాను చెప్పదలుచుకొన్న విషయాన్ని స్పష్టంగా చెప్పడంలో దమ్ము ధైర్యం వున్న నేతగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలోనే ఆనం వెంకటరమణారెడ్డి అంటే 'ఫైర్‌బ్రాండ్' అన్న పేరు తెచ్చుకున్నారు. అధికారపార్టీ నాయకుల బెదిరింపులకు లొంగకుండా తనదైన శైలిలో ఆయన గొంతు విప్పేవారు. ఏసీ సుబ్బారెడ్డి మనవడిగా, ఆనం భక్తవత్సలరెడ్డి తనయునిగా జిల్లాకు సుపరిచితులైన ఆనం వెంకటరమణారెడ్డిని ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమించడంతో టీడీపీ వర్గాల్లోనూ, వారి అభిమానుల్లోనూ సంతోషం వెల్లువెత్తుతోంది.

### పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

కోవూరు నియోజకవర్గంలో పోలంరెడ్డి కుటుంబానికి పట్టుంది. దినేష్‌రెడ్డి నాన్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రెండుసార్లు అధికారపార్టీ ఎమ్మెల్యేగా కోవూరులో తన సేవలందించారు. నియోజకవర్గంలో తమకంటూ, సొంత వర్గాన్ని సంపాదించుకున్నారు. ఆయన తనయుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కూడా తెలుగుదేశం పార్టీలో చేరి యువ నాయకునిగా మంచిపేరు తెచ్చుకున్నారు. అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి, సొంత నియోజకవర్గానికి వచ్చి పార్టీకి, ప్రజలకి సేవచేస్తూ ప్రజాక్షేత్రంలో తిరిగారు. మొన్నటి ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధపడ్డారు. అయితే కొన్ని అనూహ్య పరిణామాలతో టిక్కెట్టు ప్రశాంతమ్మని వరించింది. దినేష్ నిరుత్సాహపడకుండా పార్టీ విజయానికి కృషిచేశాడు. దినేష్ త్యాగానికి గుర్తుగా ఆయనని ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. తమ నాయకుడికి రాష్ట్రస్థాయి పదవి రావడంతో పోలంరెడ్డి అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

### సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

బీజేపీ సీనియర్ నాయకునిగా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అందరికీ తెలిసినవారే. దాదాపు నాలుగు దశాబ్దాలుగా బీజేపీలో అలుపెరగని సేవలందిస్తున్న నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మూడుసార్లు పనిచేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కిసాన్‌మోర్చా నేతగా కూడా ఉన్నారు. నిబద్ధతతో పనిచేసే వ్యక్తిత్వం ఆయన సొంతం. సురేష్‌రెడ్డికి ఆ పార్టీ తరపున కూటమి ప్రభుత్వంలో ఆర్టీసి జోనల్ ఛైర్మన్ పదవి రావడం ఆయన సీనియారిటీని సిన్సియారిటీని గౌరవించడమే. కొత్తగా పదవులు పొందిన ఆ నలుగురికీ లాయర్ అభినందనలు!

# కెమెరామెన్ జార్జి..కన్నుమూత



మీడియా రంగంలో దాదాపు రెండు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేసి, మంచితనంతో అందరితో కలుపుగోలుగా ఉండే టీవీ9 కెమెరామెన్ జార్జి కన్నుమూశారు. ప్రొస్టేట్ క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ ఈనెల 11న ఆయన నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. కెమెరామెన్‌గా ఎంతో సమర్ధవంతంగా విధులు నిర్వహించే జార్జి మృతి అందరినీ కలచివేసింది. ఆయన మరణం పట్ల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణలు సంతాపం వ్యక్తంచేస్తూ, జార్జి మృతి బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. అదేవిధంగా, మీడియా రంగంలోని ఫోటోగ్రాఫర్లు, పాత్రికేయులు జార్జి లేని లోటు తీరనిదంటూ విచారం వ్యక్తం చేశారు. అందరితో ఆత్మీయంగా ఉండే జార్జి.. కెమెరామెన్‌గా ఎంతో ఉత్సాహంగా విధులు నిర్వహించేవారు. ఆయన మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలుపుతోంది 'లాయర్'!..

## టూకీగా...



### పెంచలకోనలో వైభవంగా.. శ్రీ నృసింహస్వామి కల్యాణం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి–చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం ఈనెల 9న అత్యంత వైభవంగా జరిగింది. నిత్యకల్యాణ మండపంలో స్వామి–అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

### బ్రహ్మదేవిలో అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామదేవత శ్రీ అంకమ్మతల్లికి ఈనెల 9న ప్రత్యేకపూజలు జరిగాయి. శిథిలావస్తలో ఉన్న అంకమ్మ ఆలయాన్ని మాజీ ఎంపీపీ దివంగత మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి తనయుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి దాతృత్వంతో పునరుద్ధరించి, మెట్టావారి కుటుంబసభ్యురాలు వింధ్యారెడ్డి పూజలు ప్రారంభించారు.

### పాలిచెర్లపాడులో ఉచిత పశువైద్య శిబిరం

మండల కేంద్రమైన వెంకటాచలంలోని మండవ ఫౌండేషన్ వారు ఈనెల 9న పాలిచెర్లపాడులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కనుపూరు పశువైద్యాధికారిణి పి.శ్రీలక్ష్మి, ఫౌండేషన్ వైద్యులు శ్రీనివాసులునాయుడు పాల్గొని 54 గేదెలకు వైద్యపరీక్షలు, అవసరమైన చికిత్సలు చేశారు. గోపాలమిత్రలు శ్రావణ్‌కుమార్, రామయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

### లింగసముద్రంలో నైపుణ్య గణన శిక్షణ

మండల కేంద్రమైన లింగసముద్రంలో ఇటీవల సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణన సర్వే పట్ల శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసులు పాల్గొని నైపుణ్య గణన ప్రాధాన్యతను వివరించి, సర్వేను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

### కంచర్లగుంటలో సైబర్ నేరాల పట్ల అవగాహన

కందుకూరు మండలంలోని కంచర్లగుంట గ్రామంలో ఇటీవల సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సైబర్ మోసాల పట్ల గ్రామస్తులకు అవగాహన కలిగించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి ఎలాంటి వివరాలు ఇవ్వకుండా, వారి మోసపుమాటల బారినపడకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

### గౌరీపురంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ

విడవలూరు మండలం రామతీర్థం పంచాయతీలోని గౌరీపురంలో ఇటీవల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.జి.లలితా శివజ్యోతి ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. వేరుశనగ పంటలో ఎక్కువ దిగుబడి వచ్చేలా సాగు చేపట్టేందుకు రైతులకు సూచనలిచ్చారు డా.విజయకుమార్‌నాయక్, రైతు సేవాకేంద్రం అధికారి సాయి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### బొడ్డువారిపాళెంలో గ్రామ సభ

కొడవలూరు మండలం బొడ్డువారిపాళెం గ్రామంలో ఇటీవల గ్రామ సభ జరిగింది. తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రైతుల భూముల రీ–సర్వేకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్, అరుణ్‌కుమార్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### కృష్ణపట్నం జడ్పీస్కూల్‌కు బీరువా వితరణ

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని జడ్పీ హైస్కూల్‌కు ఈదూరు హైస్కూల్‌లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈనెల11న బీరువాను బహుకరించారు. ఈదూరులో తనవద్ద చదువుకున్న విద్యార్థులు, తానిప్పుడు పనిచేస్తున్న కృష్ణపట్నం హైస్కూల్‌కు సహకారం అందించడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు సరళ వారిని అభినందించారు.

### కోడూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

తోటపల్లిగూడూరు మండలం కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యశాఖ అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఈనెల 11న ఆకస్మికంగా తనిఖీ చేసి, వ్యాధినిరోధక టీకాలుకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు.

# శ్రద్ధాంజలి



జననం
23.02.1954

నిర్యాణం
04.11.2024

అనురాగ దీప్తి, ఆత్మీయమూర్తి
మా ఇంటి దీపం, మా కంటి రూపం

## శ్రీమతి అనపల్లి సులోచన గారు

నవంబర్ 4వ తేదీ, సోమవారం దైవసాన్నిధ్యం పొందారు.
వారి దివ్య ఆత్మకి సద్గతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త : **అనపల్లి అశోక్‌రెడ్డి**

కుమారులు - కోడళ్ళు

**అనపల్లి రమేష్‌కుమార్‌రెడ్డి - దీప్తి**

**అనపల్లి కమలేష్‌కుమార్‌రెడ్డి - సవ్య**

మనుమడు : **అనపల్లి రుత్విక్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు :** వారి 'పెద్దకర్మ' **20-11-2024** బుధవారం ఉదయం 11.30 గంటలకి, కోవూరు జాతీయ రహదారి పక్కన గల **అనపల్లి కన్వెన్షన్ సెంటర్** నందు జరుగును.
బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com